www.suryaa.news
ప్రభాత
# సూర్య
తెలుగు జాతీయ దిన పత్రిక
వేల రూ.5/ - పేజీలు : 8 మంగళవారం 27 మే 2025 సంపుటి: 01, సంచిక : 23
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

## నిన్న యాపిల్.. నేడు శామ్‌సంగ్

భారత్‌లో తయారైన ఐఫోన్లను అమెరికాలో ఎక్కడ విక్రయించినా ఇరవై ఐదు శాతం సుంకం విధిస్తానని యాపిల్ కంపెనీని హెచ్చరించిన కొన్ని గంటలకే దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శామ్‌సంగ్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. శామ్‌సంగ్ సహా అమెరికా వెలుపల తయారయ్యే ఏ కంపెనీ ఫోన్ అయినా వాటికి టారిఫ్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఓవల్ కార్యాలయం వెలుపల ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ 'మరిన్ని కంపెనీలూ సుంకాలు చెల్లించాల్సిందే. అది శామ్‌సంగ్ కావచ్చు. ఐఫోన్‌ను ఉత్పత్తి చేసే మరో కంపెనీ కావచ్చు. ఆ కంపెనీలు తమ ఫోన్లను ఇక్కడ తయారు చేస్తే సుంకం ఉండదు' అని చెప్పారు. యాపిల్ సీఈఓ టిమ్ కుక్‌కు సుంకాల విషయాన్ని గతంలోనే చెప్పానని ట్రంప్ అంతకుముందు అన్నారు.

# కేబినెట్ విస్తరణ వాయిదా



- కేసీ, మహేశ్‌గౌడ్‌తోనే రాహుల్ చర్చలు
- సామాజికవర్గాలు,జిల్లాల వారీగా ఆశావహుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు
- ఏఐసీసీ ఆలోచనలకు, పీసీసీ ప్రతిపాదనలకు, సీఎం ఉద్దేశాలకు మధ్య వైరుధ్యం!
- ఒకరిద్దరి విషయంలో రేవంత్, ఏఐసీసీ పెద్దల పట్టుదల
- బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలంటున్న మహేశ్‌గౌడ్
- ఢిల్లీలోనే ఉన్నా సమావేశానికి దూరంగా ముఖ్యమంత్రి
- రాహుల్‌తో చర్చల సారాంశాన్ని సీఎంకు వివరించిన పీసీసీ చీఫ్
- హైదరాబాద్‌కు రేవంత్..ఢిల్లీలోనే మహేశ్‌గౌడ్

సూర్య న్యూఢిల్లీ

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన చర్చలు మళ్లీ అసంపూర్తిగానే ముగిశాయి. ఆశావహుల తుది జాబితాపై ఏకాభిప్రాయం కుదరలేదని తెలిసింది. సామాజిక సమీకరణాల మేరకు తుది జాబితాను ఖరారు చేయడంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో దీనిపై మరోసారి భేటీ కావాలని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ భావించినట్లు సమాచారం. దీంతో కేబినెట్ విస్తరణపై ఏదో ఒకటి తేల్చుకుని - మిగతా2లో



## పల్లెపల్లెకూ వాతావరణ అంచనా

- ప్రపంచంలోనే అత్యాధునిక వాతావరణ అంచనా వ్యవస్థ ఆవిష్కరణ
- భారత్ ఫోర్‌క్యాస్టింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చిన కేంద్రం

3



## జడ్జి నోట్ల కట్టల వ్యవహారం.. ఆ లేఖలో వివరాలను బహిర్గతం చేయలేం

- కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ రూపొందించిన నివేదికను బహిర్గతం చేయడం కుదరదు
- అందులో విషయాలను బహిర్గతం చేయాలంటూ ఆర్టీఐ వ్యవస్థ ద్వారా న్యాయస్థాన సమాచార అధికారికి దరఖాస్తు



## టూరిజం మాది.. టెర్రరిజం మీది

- నా బుల్లెట్ రెడీ : పాక్‌కు మోదీ వార్నింగ్
- పాకిస్థాన్‌లో ఉగ్రవాదానికి తెరపడాలంటే ఆ దేశ ప్రజలు ముందుకొచ్చి, ఎవరి తిండి వారు తింటూ ప్రశాంత జీవనం సాగించాలి
- కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు పూర్తయింది
- భారత్ గణనీయమని ఆర్థిక ప్రగతి సాధించింది

## ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి

- వివక్ష లేకుండా అన్ని రంగాల్లోనూ వారికి ఉపాధి
- స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క



సూర్య హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ విభాగాల్లో ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పించాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. వివక్ష లేకుండా అన్ని రంగాల్లోనూ వారికి ఉపాధి కల్పిస్తామన్నారు. ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్ల స్ఫూర్తితో సమాజంలో గౌరవప్రదమైన ఉద్యోగాలు చేసేందుకు ముందుకురావాలని కోరారు. ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య పరిరక్షణ కోసం త్వరలో మరిన్ని మైత్రి క్లినిక్‌లు ప్రారంభిస్తామని - మిగతా2లో




## విద్యాశాఖకూ కమాండ్ కంట్రోల్ సెంటర్

- అన్నిరకాల గణాంకాలు, పథకాలకు కేంద్రీకృత డ్యాష్‌బోర్డు
- తొలి విడతలో 8 విభాగాల పనులు పూర్తి

2

## దేశ ఆకలి తీర్చే పెద్దన్నగా తెలంగాణ



- గతేడాది రికార్డు స్థాయిలో పంటల ఉత్పత్తులు
- 275 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి
- రాష్ట్ర అర్థ, గణాంకశాఖ అంచనాల్లో వెల్లడి

సూర్య హైదరాబాద్

దేశ ప్రజల ఆకలి తీర్చే బృహత్‌కార్యంలో పెద్దన్న పాత్ర పోషించే రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. రికార్డుస్థాయి బియ్యం ఉత్పత్తితో దేశంలోనే ముందుందని రాష్ట్ర అర్థ, గణాంకశాఖ తెలిపింది. వాతావరణం అనుకూలించడం, ప్రభుత్వ సానుకూల విధానాలతో గతేడాది(2024–25) రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరిగాయని ఈ శాఖ తాజాగా విడుదల చేసిన అంచనాల్లో వెల్లడించింది. బియ్యం ఒకటే కాకుండా పలు ఇతర పంటల దిగుబడి సైతం అంతకుముందుతో పోలిస్తే గణనీయంగా పెరిగినట్లు వివరించింది. తాజా నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ శాఖ అందజేసింది. - మిగతా2లో




## పాక్‌కు గూఢచర్యం.. సీఆర్పీఎఫ్ జవాన్ అరెస్ట్

సూర్య న్యూఢిల్లీ

పాకిస్తాన్ తరఫున గూఢచర్యం చేస్తున్న ఆరోపణలపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు సీఆర్పీఎఫ్ జవాన్‌ను అరెస్ట్ చేశారు. సీఆర్పీఎఫ్ ఢిల్లీ విభాగంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మోతీ రాం జాట్ జాతి భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ అధికారుల (పీఐఓ)కు అందజేస్తున్నాడని ఎన్ఐఏ సోమవారం తెలిపింది. వివిధ మార్గాల ద్వారా పీఐవోల నుంచి ప్రతిఫలం అందుకుంటున్నట్లు గుర్తించామని వివరించింది. నిబంధనల ప్రకారం ఈ ఏడాది మే 21వ తేదీ నుంచి ఇతడిని విధుల నుంచి తొలగించినట్లు సీఆర్పీఎఫ్ తెలిపింది. ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం జాట్‌ను జూన్ 6వ తేదీ వరకు కస్టడీకి అనుమతించింది.

## శతాబ్దపు అతిపెద్ద మోసం.. కాంగ్రెస్ మ్యానిఫెస్టో

- ఈ పాలన ఇంకెన్నాళ్లని ప్రజలు అనుకుంటున్నారు
- తెలంగాణకు గులాబీ జెండానే గుండె ధైర్యం
- పార్టీలో చేరికల సందర్భంగా కేటీఆర్



సూర్య హైదరాబాద్

ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ పార్టీ అభయహస్తం మ్యానిఫెస్టో అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ పాలనను ఇంకెన్నాళ్లు భరించాలని ప్రజలు అడుగుతున్నారని పేర్కొన్నారు. "అధికారం కోసం అబద్ధపు హామీలిచ్చి, నాలుగు కోట్ల మంది ప్రజలను దారుణంగా మోసం చేసిన పార్టీ కాంగ్రెస్. ఢిల్లీ పార్టీలను నమ్ముకుంటే నిండా మోసపోతాం. తెలంగాణకు ఎప్పటికీ గులాబీ జెండా మాత్రమే గుండె ధైర్యమనే విషయం ప్రజలకు తెలుసు. జూన్‌లో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుంది. గ్రామస్థాయి నుంచి కమిటీల నిర్మాణం చేసుకుని ముందుకు సాగుదాం. స్థానిక సంస్థల ఎన్నికలైనా.. ఉప ఎన్నికలు వచ్చినా.. కాంగ్రెస్, భాజపాలకు తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అని కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం గద్వాలకు చెందిన కాంగ్రెస్, భాజపా నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో భారాసలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ - మిగతా2లో

ప్రభాత సూర్య
తెలుగు జాతీయ దిన పత్రిక



# ముందస్తు నైరుతి ఎందుకంటే..!

రుతుపవనాల రాక కోసం కర్షకుడు ఆకాశంకేసి కళ్లు కాయలు కాచేలా చూస్తాడు. హలధారితో దోబూచులాడే రుతుపవనాలు ఈసారి రైతన్నలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూ ఆగమేఘాల మీద దూసుకొచ్చి వర్షాలను దంచికొడుతున్నాయి. అడవుల నరికివేత, యథేచ్ఛగా సాగుతున్న మానవ కార్యకలాపాలు, శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం తదితరాలతో వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ సంభవించిన కారణంగానే రుతుపవనాలు ఇలా ముందుగా వచ్చేశాయని ఎన్నో విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే ఇలా ముందస్తు వర్షాలు గతంలో సర్వసాధారణమని వాదించే వాళ్లూ ఉన్నారు. దీంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ముందస్తు రాకకు కారణాలేంటి అనే దానిపై ఇప్పుడు చర్చ మొదలైంది.

**గతంలోనూ ముందొచ్చాయి**

కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలో నైరుతి రుతుపవనాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఊరకే రాష్ట్రాలను చుట్టేయకుండా భారీ వర్షాలతో పలకరించి ఈసారి అధిక వర్షాలు ఖాయమని కబురును రుతుపవనాలు మోసుకొచ్చాయి. అయితే ఇలా ముందస్తు రాక కొత్తేమీ కాదని గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఈసారి పలు రాష్ట్రాల్లోకి రెండు వారాల ముందే రుతుపవనాలు ప్రవేశించడంతోపాటు కేరళ నుంచి మహారాష్ట్రదాకా అవి వేగంగా, విస్తారంగా మే 24న ఒక్కరోజులోనే విస్తరించడం విశేషం. ఇది అసాధారణమేమీ కాదని, కేవలం అరుదైన విషయమని గణాంకాలు చాటుతున్నాయి. 1971 ఏడాదిలోనూ రుతుపవనాలు కర్ణాటకలో అధిక భాగం, మహారాష్ట్రలో కొంత మేర ఒకేసారి విస్తరించి అప్పుడు అందర్నీ విస్మయానికి గురిచేశాయి. మళ్లీ దాదాపు యాభై ఏళ్ల తర్వాత ఇదే తరహాలో రుతుపవనాలు ఒకేసారి విస్తరించాయి.

**ఆ తర్వాత కాస్తంత బ్రేక్**

జూన్ రెండో తేదీదాకా రుతుపవనాలు ఇదే వేగంతో విస్తరిస్తాయని వాతావరణ శాఖ వర్గాలు అంచనావేస్తున్నాయి. మహారాష్ట్ర, తూర్పు భారతాన్ని త్వరగా చుట్టుముట్టాక వేగం తగ్గే వీలుంది. గతంలో మాది రే వేగం నెమ్మదించి మెల్లిగా రుతుపవనాలు ముందుకు సాగనున్నాయి. మధ్య స్థాయి ఎత్తులో పొడి వాతావరణం ఏర్పడటంతో జూన్ మొదటి వా రం తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. తరచూ వర్షాలు పడే అవకాశాలు సన్నగిల్లుతాయి. రుతుపవనాల గమన వేగం సైతం తగ్గనుంది.

**ముందస్తుపై వాతావరణ మార్పుల ప్రభావం**

సహజ వాతావరణ వ్యవస్థతోపాటు మానవ ప్రేరేపిత భూతాపోన్నతి, గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు వంటి అంశాలూ రుతుపవనాలపై ప్రభావం చూపిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతానికైతే భారత్‌లో రుతుపవనాల రాకపై వాతావరణ మార్పుల ప్రభావం పరిమిత స్థాయిలోనే ఉందని వారు అభిప్రాయపడ్డారు. భూతాపోన్నతి దెబ్బకు యురేసియా, హిమాలయ ప్రాంతాల్లో మంచు దుప్పటి కరిగిపోతోంది.

1990%–%2020 కాల సగటుతో పోలిస్తే ప్రస్తుతం యురేసియా, హిమాలయాల పరిధిలో మంచు 15 శాతం అంతరించిపోయింది. తక్కువ మంచు కారణంగా ఉపరితల ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీంతో రుతుపవనాలు ప్రేరేపితమై త్వరగా వస్తాయి. ఒక్కోసారి మే నెల మధ్యలోనే ఇవి రావొచ్చు. గ్లోబ ల్ వార్మింగ్‌లో పెరిగే ప్రతి ఒక్క డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతకు సముద్రాలపై వాతావరణంలో తేమ 6%–%8 శాతం పెరుగుతుంది. పారిశ్రామిక విప్లవానికి ముందునాటితో పోలిస్తే 2025లో ఉష్ణోగ్రత 1.2 డిగ్రీ సెల్సియస్ పెరిగిందని ఇప్పటికే గణాంకాలు చాటుతున్నాయి. ఈ నేపథ్యంలో అరేబియన్ సముద్రం, బంగాళాఖాతం ఉపరితల వాతావరణంలో తేమ పెరిగి మే నెలలోనే మేఘాల అధిక ఆవిర్భావానికి దారితీసింది. కర్ణాటక%–%గోవా తీరం వెంట ద్రోణి కారణంగా తుపాను పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇవి ఈసారి రుతుపవనాలను మరింత ముందుకు లాగాయి. మారిషస్, మడగాస్కర్‌ల మధ్య తక్కువ ఎత్తులో వీచే పవనాల దృగ్విషయాన్ని సోమాలీ జెట్‌గా పిలుస్తారు. ఇది ఈనెలలోనే విజృంభించింది. ఈ గాలులు అరేబియా సముద్రం మీదుగా భారత పశ్చిమ తీరం వైపు వీస్తాయి. ఇవి కేరళ, కర్ణాటక, గోవా, మహారాష్ట్రలనూ తాకుతాయి. ఈసారి సోమాలీ జెట్ గాలుల ప్రభావం తోడవడంతో నైరుతి పవనాలు త్వరగా వచ్చేశాయి.

**మరెన్నో కారణాలు..**

భౌగోళిక, సముద్ర, వాతావరణ పరిస్థితుల మధ్య సమన్వయంలో తేడా సైతం ఈసారి రుతుపవనాల ఆగమనాన్ని ముందుకు తోసింది. భూమధ్యరేఖ జోన్‌లో ప్రతి 30 నుంచి 60 రోజులకు ఒకసారి సముద్రజలాల మీదుగా మేఘాలు, వర్షాలు, పవనాలు ఒక క్రమపద్ధతిలో ముందుకు సాగుతాయి. దీనినే మేడిన్ జూలియన్ ఆసిలేషన్(ఎంజేఓ)గా పిలుస్తారు. ఎంజేఓ అనేది రుతుపవనాల్లో తేమ, పొడి దశలను నిర్దేశిస్తుంది. ఈనెలలో ఎంజేఓ మూడో దశలోఉంది. ఇది మేఘావృత స్థితిని అధికం చేసి దక్షిణభారతంలో వర్షాలను కురిపిస్తుంది. మే 25వ తేదీన ఇది నాలుగోదశకు మారడంతో హిందూ సముద్రం నుంచి మరింత తేమ పవనాల రూపంలో భారత్‌పై కురిసింది. ఈసారి ఎల్‌నినో సైతం తటస్థ వైఖరిని ప్రదర్శించడంతో రుతుపవనాలకు అనుకూల వాతావరణం ఏర్పడింది. అందుకే ఈసారి వర్షాలు ముందే పడ్డాయి.

# అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌ను ముంచెత్తిన వరద నీరు


ముంబై: ముంబై మునిగింది. దేశ ఆర్థిక రాజధాని వర్షాలతో అతలాకుతలమైంది. నైరుతి రుతు పవనాల ప్రభావంతో రాత్రి నుంచి ముంబైలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ముంబై మహానగరానికి వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. కుండపోతవానకు నగరం నరకంలా మారింది. రవాణా స్తంభించి పోయింది. రోడ్లు చెరువుల్లా మారడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన కూడళ్లలో భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాక్‌లపైకి వాన నీరు చేరడంతో రైల్వే సర్వీసుల్లో అంతరాయం ఏర్పడింది. మే 10న ప్రారంభమైన వర్లీ మెట్రో స్టేషన్‌కు వరదనీరు పోటెత్తింది. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ట్రైన్ వచ్చే వరకు, వచ్చిన తర్వాత ట్రైన్ లోపలికి వెళ్లేందుకు వినియోగించే స్టేషన్ గేట్ల వరకు మాత్రమే కాకుండా ప్లాట్‌ఫామ్‌లను నీరు ముంచెత్తింది. వెలుగులోకి వచ్చిన ఆ వీడియోల్లో ప్లాట్ ఫామ్ పూర్తిగా బురద నీటితో నిండిపోయి ఉండటాన్ని చూడొచ్చు. అంతేకాదు, మెట్రో లోపల తీసిన మరో వీడియోలో పైకప్పులో లీకేజీ కారణంగా ప్లాట్‌ఫారమ్‌పై నుండి నీరు ప్రవహించింది. భారీ ఎత్తున నీరు నిలిచిపోవడంతో మెట్రోసర్వీసులకు ఆటంకం ఏర్పడింది. అయితే, అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లో వరదకు కారణం డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడమే కారణమని తెలుస్తోంది.



ముంబై మూడు లైన్ల అండర్‌గ్రౌండ్ మెట్రోస్టేష న్‌ను బాంద్రా–కుర్లా కాంప్లెక్స్ నుండి వర్లిలోని ఆచార్య అత్రే చౌక్ వరకు సేవల్ని అందిస్తోంది. ఈ మెట్రో సేవలు ఈ నెల ప్రారంభంలో మే 10న అందుబాటులోకి వచ్చాయి. ఇటీవలే ప్రారంభమైన మెట్రోస్టేషన్‌ను వరద నీరు ముంచెత్తడంతో మౌలిక సదుపాయాల గురించి ప్రశ్నలు తలెత్తాయి.

# ఊపిరి పీల్చుకున్న నాసా : ఎవరీ యువరాజ్ గుప్తా

మట్టిలో పుట్టిన మాణిక్యాలకు మన దేశంలో కొదువ లేదు. చిన్న వయసులోనే అత్యద్భుతమైన నైపుణ్యంతో అబ్బుర పరచడమే కాదు, అరుదైన ఘనతను సొంతం చేసుకుంటారు. అలాంటి రత్నం లాంటి వ్యక్తి గురించి తెలుసుకుందామా. మహా మహా నిపుణులే కనిపెట్టలేని బగ్‌ను గుర్తించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఒకప్పుడు తన పొరుగువారి %ఔఱ-ఖీఱ% ని హ్యాక్ చేసి దానితో ఆడుకునే ఆ పిల్లవాడు, నేడు %చీూూ% వంటి ప్రపంచంలోని అతిపెద్ద అంతరిక్ష సంస్థ వెబ్‌సైట్‌ను సైబర్ దాడుల నుండి రక్షించాడు కాన్పూర్‌కు చెందిన యువరాజ్ గుప్తా తన సామర్థ్యాలతో ప్రపంచం మొత్తాన్ని ఆశ్చర్యపరిచాడు. ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన 11వ తరగతి విద్యార్థి యువరాజ్ గుప్తానేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) వెబ్‌సైట్‌లో తీవ్రమైన భద్రతా లోపాన్ని కనుగొన్నాడు. ఈ బగ్ ద్వారా, ఎవరైనా అధికారిక ఇమెయిల్ నుండి నకిలీ సందేశాలను పంపవచ్చు. ఎంతోమంది సైబర్ నిపుణులు ఈ లోపాన్ని పట్టుకోలేకపోయారు, కానీ యువరాజ్ దాన్ని గుర్తించడం విశేషంగా నిలిచింది. బగ్ బౌంటీ కార్యక్రమంలో దాదాపు రెండు వారాల పాటుప్రయత్నించిన , ఇక ఆశ వదిలేసుకుంటున్న సమయంలో ఒక రాత్రి అతను సబ్ డొమైన్‌లో లోపాన్ని కనుగొన్నాడు. దీనిపై సమగ్ర నివేదికను తయారు చేసి వీడియోతో పాటు నాసాకు పంపించాడు. ఇది మాత్రమే కాదు, అతను నకిలీ ఈమెయిల్స్, రహస్య సమాచారాన్ని చేరవేసే బగ్‌ల గురించి తెలియజేశాడు. యువరాజ్ గుప్తా సాధించిన ఈ ఘనతకు నాసా గుర్తించింది. యువరాజ్‌ను ప్రశంసా పత్రం , 'హాల్ ఆఫ్ ఫేమ్'లో స్థానం కల్పించి సత్కరించింది. కాన్పూర్‌లోని సరస్వతి విద్యా మందిర్ ఇంటర్ కాలేజీ (దామోదర్ నగర్)లో చదువుతున్నాడు . 10వ తరగతిలో 79.4 శాతం మార్కులు సాధించాడు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ, అతను యూట్యూబ్, ఆన్‌లైన్ కోర్సులు, పుస్తకాల ద్వారా ఎథికల్ హ్యాకింగ్‌పై పట్టు సాధించాడు. 6వ తరగతిలో ఉన్నప్పటినుంచీ సైబర్ సెక్యూరిటీపై ఆసక్తి పెంచుకున్నాడు. పట్టువదలకుండా ఎథికల్ హ్యాకింగ్‌లో నైపుణ్యాన్ని సాధించాడు. తాజాగా తన నైపుణ్యంతో నాసాను ఇంప్రెస్ చేయడం విశేషం. యువరాజ్ గుప్తా తండ్రి జై నారాయణ్ గుప్తా ఒక ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. తల్లి కల్పనా గుప్తా గృహిణి. యువరాజ్ కు ల్యాప్ టాప్ ఇవ్వడానికి, అతని సోదరి స్కాలర్‌షిప్ , అతని తండ్రి పొదుపు మొత్తాన్ని కలిపి మొత్తం సిస్టంను సమకూర్చుకున్నాడట. దేశానికి డిజిటల్ భద్రతను అందించాలనే సంకల్పంతో ఉన్నామంటోంది యువరాజ్ కుటుంబం.



## మళ్లీ భయపెడుతున్న కరోనా!

గత నెలన్నరగా కరోనా కొత్త వేరియంట్ జేఎన్.1 ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నది. ఇప్పటి వరకు నిర్వహించిన అధ్యయనాల్లో ఒమిక్రాన్ ఇతర వేరియంట్స్ కన్నా ఇన్ఫెక్షన్ రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ.. తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం తక్కువగా ఉన్నట్లు నిపుణులు గుర్తించారు. అమెరికా, సింగపూర్ వంటి దేశాల్లో ఈ వేరియంట్ కారణంగా కేసులు వేగంగా పెరుగుతున్నట్లు తేలింది. ఆయా దేశాల్లో ఆసుపత్రుల్లో చేరిన రోగుల సంఖ్య పెరిగింది. ఈ వేరియంట్ కారనంగా జనవరిలో చైనాలో మరోసారి ఇన్ఫెక్షన్ పెరుగుదల ఉండవచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా జేఎన్.1 వేరియంట్ ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సమస్యలను పెంచుతుంది. అయితే, భారత్‌లో పరిస్థితిని పరిశీలిస్తే.. గత రెండు, మూడురోజులుగా ఇన్ఫెక్షన్ కేసుల్లో తగ్గుదల ఉన్నట్లు తెలిసింది. 20 రోజుల కిందట రోజుకు 500–600 మందికి వైరస్ సోకగా.. ప్రస్తుతం రోజుకు సగటున 300 తగ్గింది. కొత్త వేరియంట్ కారణంగా గత నెల రోజుల నుంచి దేశంలో కొవిడ్ పరీక్షలు పెరిగాయి. అయితే, అందరూ కొవిడ్ పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుత సమయంలో దగ్గు, జలుబు కారణంగా కేసులు పెరుగుతున్నాయని.. ఈ క్రమంలో ప్రతీది కొవిడ్ అనుకోవాల్సిన అవసరం లేదని తెలుపుతున్నారు. ప్రస్తుతం పలు రాష్ట్రాలు కొవిడ్ పరీక్షలకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేశాయి. వైరస్‌తో సోకిన తర్వాత లక్షణాలు అభివృద్ధి చెందేందుకు ఇంక్యుబేషన్ పీరియడ్ ఉంటుందని.. ప్రతి ఇన్ఫెక్షన్‌కు ఇంక్యుబేషన్ పీరియడ్ భిన్నంగా ఉంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కోవిడ్ రోగులకు చికిత్స చేసే ఇంటెన్సివ్ కేర్ డాక్టర్ వినీత్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. కరోనావైరస్ యొక్క ఇంక్యుబేషన్ పీరియడ్ 4–10 రోజులు ఉంటుందని చెప్పారు.

## పల్లెపల్లెకూ వాతావరణ అంచనా

న్యూఢిల్లీ

కొన్ని గ్రామాలకు కలిపి ఉమ్మడి అంచనాను విడుదలచేయడానికి బదులు అత్యల్పంగా ఆరు కిలోమీటర్ల పరిధిలోనూ వాతావరణ స్థితిని తెలియజెప్పే అత్యాధునిక వ్యవస్థను భారత్ సోమవారం ఆవిష్కరించింది. భారత ఉష్ణమండల వాతావరణశాస్త్ర సంస్థ(ఐఐటీఎం) అభివృద్ధి చేసిన ఈ సాంకేతికతకు భారత్ ఫోర్‌క్యాస్టింగ్ సిస్టమ్(బీఎఫ్ఎస్) అని నామకరణం చేశారు. దీనిని భూవిజ్ఞాన శాఖ మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం ఆవిష్కరించి జాతికి అంకితమిచ్చారు. యురోపియన్, బ్రిటిష్, అమెరికా వాతావరణ విభాగాలు సైతం 9 కిలోమీటర్ల నుంచి 14 కిలోమీటర్లను ఒక యూనిట్‌గా తీసుకుని వాతావరణ అంచనాలు వెలువరుస్తుండగా భారత్ ఆరు కిలోమీటర్ల స్థాయిలోనూ వాతారణ అంచనాను ఇకపై వెలువర్చనుండటం విశేషం. ఆరు కిలోమీటర్ల రెజల్యూషన్‌తో భారత వాతావరణ శాస్త్ర శక్తిసామర్థ్యాల పురోగతిని బీఎఫ్ఎస్ చాటుతోందని మంత్రి జితేంద్ర వ్యాఖ్యానించారు. "వాతావరణానికి సంబంధించిన భూమధ్యరేఖ జోన్ అనేది అత్యంత అస్తవ్యస్తంగా ఉంటుంది. దీనిని అంచనావేయడానికి అత్యధిక రెజల్యూషన్ వ్యవస్థ తప్పనిసరి"అని భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ చెప్పారు.

**ఏమిటీ బీఎఫ్ఎస్?**

దేశవ్యాప్తంగా అమర్చిన 40 డాప్లర్ వాతావరణ రాడార్ల నుంచి సేకరించిన సమాచారాన్ని అత్యంత వేగంగా విశ్లేంచి చిన్నపాటి 'వాతావరణ అంచనా'నివేదికను రూపొందిస్తారు. గతంలో వాతావరణ యూనిట్ పెద్దగా ఉండేది. అంటే నాలుగైదు గ్రామాలకు కలిపి ఒకే అంచనాకు వచ్చేవారు. ఇప్పుడు ఎప్పటికప్పుడు డాప్లర్ రాడార్ల సంఖ్యను పెంచుకుంటూ అదనపు డేటాతో మరింత స్పష్టమైన 'వాతావరణ అంచనా'ను రూపొందిస్తారు. నాలుగు గ్రామాలకు కలిపికాకుండా విడివిడిగా ఒక్కో గ్రామానికి సైతం 'వాతావరణ అంచనా'ను ప్రకటిస్తారు. డాప్లర్ వెదర్ రాడార్ల సంఖ్యను 100కు పెంచనున్నారు. దీంతో వచ్చే రెండు గంటల్లో వాతావరణం ఎలా ఉండబోతోందో సులభంగా అంచనావేసి చెప్పేయనున్నారు. ఈ ఫోర్‌క్యాస్టింగ్ సిస్టమ్‌ను పరిశోధకులతోపాటు పార్థసారథి ముఖోపాధ్యాయ అభివృద్ధిచేశారు. పార్థసారథి గతంలో ఐఐటీఎం క్యాంపస్‌లో ఆర్కా సూపర్‌కంప్యూటర్‌ను ఏర్పాటుచేశారు. ఇది 11.77 పెటాఫ్లాప్ సామర్థ్యంతో 33 పెటాబైట్స్ స్టోరేజీ కెపాసిటీతో పనిచేస్తుంది. పాత సూపర్‌కంప్యూటర్ ప్రత్యూష్ పది గంటల్లో చేసే పనిని ఇది కేవలం నాలుగు గంటల్లో చేయగలదు.

## టూరిజం మాది.. టెర్రరిజం మీది

భుజ్

ఉగ్రవాదానికి పాక్ స్వస్తి చెప్పాలని, ఇందుకు ఆ దేశ ప్రజలు ముందుకు రావాలని, శాంతిని ఎంచుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హితవు పలికారు. అలాకాని పక్షంలో తన 'బుల్లెట్' రెడీగా ఉందని హెచ్చరించారు. గుజరాత్‌లో రెండ్రోజుల పర్యటనలో భాగంగా భుజ్‌లో సోమవారంనాడు జరిగిన ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, పాకిస్థాన్‌లో ఉగ్రవాదానికి తెరపడాలంటే ఆ దేశ ప్రజలు ముందుకొచ్చి, ఎవరి తిండి వారు తింటూ ప్రశాంత జీవనం సాగించాలని, లేదంటే బుల్లెట్ తన దగ్గర సిద్ధంగా ఉందని అన్నారు. కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు పూర్తయిందని, భారత్ గణనీయమని ఆర్థిక ప్రగతి సాధించిందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. పాక్ పరిస్థితి ఏమిటని నిలదీశారు. జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందని, పాకిస్థాన్ ఎక్కడ ఉందో ఆలోచించుకోవాలని అన్నారు.

**టూరిజం మాది.. టెర్రరిజం మీది**

భారతదేశం పర్యాటకాన్ని (టూరిజం) నమ్ముకుంటే పాకిస్థాన్ టెర్రరిజంను నమ్ముకుంటోందని, అది ప్రపంచానికి ప్రమాదకరమని ప్రధాని అన్నారు. పాకిస్థాన్ ప్రజలను ఒకటి అడగదలచుకున్నాను. టెర్రరిజం వల్ల ఏమి సాధించారు? ఇవాళ ప్రపంచంలోనే భారత్ నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. మీ పరిస్థితి ఎలా ఉంది? ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారు మీ భవిష్యత్తును నాశనం చేస్తున్నారు.. అని మోదీ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఉగ్రవాదంపై పాక్ చర్యలు తీసుకుంటుందనే ఆశాభావంతో 15 రోజులు వేచిచూశానని, అయితే ఉగ్రవాదం ఊపిరిగా ఉన్న పాక్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రధాని చెప్పారు. మానవత్వాన్ని కాపాడేందుకు, ఉగ్రవాదానికి చరమగీతం పాడేందుకు ఆపరేషన్ సిందూర్ చేపట్టామని తెలిపారు. మే 9న పౌరులనే లక్ష్యంగా చేసుకుని పాక్ దాడులకు ప్రయత్నించడంతో ఇండియన్ ఆర్మీ రెట్టించిన బలంతో వారి మిలటరీ స్థావరాలను ధ్వంసం చేసిందని చెప్పారు. కాగా, ఈ సభకు ముందు ప్రధాని వడోదరలో భారీ రోడ్‌షో నిర్వహించారు. కల్నల్ సోఫియా ఖురేష్ కుటుంబ సభ్యులతో పాటు పెద్దఎత్తున ప్రజలు ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు.


## జడ్జి నోట్ల కట్టల వ్యవహారం..

## ఆ లేఖలో వివరాలను బహిర్గతం చేయలేం



న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ 'నోట్ల కట్టల' వ్యవహారంలో ఇవాళ కీలక మలుపు చోటు చేసుకుంది. కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ రూపొందించిన నివేదికను బహిర్గతం చేయడం కుదరదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న టైంలో ఆయన అధికారిక బంగ్లాలో అగ్నిప్రమాదం చోటు చేసుకోగా.. మంటలర్పిన ఫైర్, పోలీస్ పోలీస్ సిబ్బందికి కాలిన నోట్ల కట్టలు కనిపించడం, ఆ వ్యవహారం బయటకు పొక్కడం సంచలనంగా మారింది. ఈ వ్యవహారంపై కోర్టు నియమించిన కమిటీ విచారణ జరిపి నివేదికను అందజేసింది కూడా. అయితే.. అందులో విషయాలను బహిర్గతం చేయాలంటూ ఆర్టీఐ వ్యవస్థ ద్వారా న్యాయస్థాన సమాచార అధికారికి దరఖాస్తు అందింది. అయితే సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఈ దరఖాస్తును తిరస్కరిస్తూ.. ఆర్టీఐ యాక్ట్‌లోని సెక్షన్ 8(1)(%వ%) కింద సమాచారం అందించలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో 2019 సంచలన తీర్పును న్యాయస్థానం ప్రస్తావించింది. సుభాష్ చంద్ర అగర్వాల్ కేసులో.. రాజ్యాంగ పరిధిలో గోప్యత హక్కు, సమాచార హక్కు ఈ రెండింటి సమతుల్యత అవసరమని కోర్టు వ్యాఖ్యానించింది. మార్చి 14వ తేదీన జడ్జి ఊళ్లో లేని టైంలో బంగ్లాలో ఫైర్ యాక్సిడెంట్ చోటు చేసుకుని కాలిన నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ వ్యవహారంలో ఆరోపణలు రావడంతో ఆయన్ని అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అయితే అలహాబాద్ బార్ అసోషియేషన్ నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో.. బదిలీ చేసినప్పటికీ విధులేవీ ఆయనకు అప్పగించలేదు. అంతేకాదు.. మునుపెన్నడూ లేని రీతిలో ఆ ఇంట్లో బయటపడ్డ నోట్ల కట్టల ఫొటోలు, వీడియోలను సుప్రీం కోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ఆసక్తికర చర్చకు దారి తీసింది. అటుపై మార్చి 22వ తేదీన జడ్జి వర్మ నోట్ల కట్టల వ్యవహారంపై అంతర్గత విచారణకు ముగ్గురు జడ్జిలతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మే 3వ తేదీన తుది నివేదిక రూపొందించగా.. ఆ మరుసటి రోజు ఆనాడు సీజేఐగా ఉన్న సంజీవ్ ఖన్నాకు నివేదిక అందజేసింది. దానిని సీజేఐ ఓ లేఖ ద్వారా రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి తెలియజేశారు. మరోవైపు తనపై వస్తున్నవి కేవలం ఆరోపణలేనని జస్టిస్ వర్మ మొదటి నుంచి చెబుతూ వస్తున్నారు.

# శనీశ్వర పూజతో అంతా శుభమే



"నీలాంజన సమాభాసం ! రవిపుత్రం యమాగ్రజం! ఛాయా మార్తాండ సంభూతం ! తం నమామి శనైశ్చరమ్" ! భారతీయుల జ్యోతిష శాస్త్రం ప్రకారం 'శనీశ్వరుడు', నవగ్రహాలలో ఒక గ్రహం. సూర్యుడు, చంద్రుడు, ఛాయా గ్రహాలైన రాహువు మరియు కేతువులతో కలిపి గ్రహాలు తొమ్మిది. గగన మండలంలో ఉన్న గ్రహాలకు భూమితో సంబంధం ఉంది. కాబట్టి తొమ్మిది గ్రహాల ప్రభావం భూమి మీద, భూమిపై ఉన్న ప్రతి చరాచర జీవుల పైన, నిర్జీవ, ఝడ, నిర్లిప్త వస్తువుల మీద వుంటుంది. నవగ్రహాలలో ఒకటైన శని గ్రహం ఇందుకు బిన్నం కాదు. శని, శనిగ్రహం, శనేశ్వరుడు, శనీశ్వరుడు, అని పలు నామములతో పిలువబడి, గ్రహ రూపంలో పూజింపబడే 'శని' ఒక గ్రహదేవుడు. వారంలో ఏడవవారం శనివారం. శనికి మంద గమనుడు అని కూడా పేరు. శనై: క్రమతీతి అనగా అతినెమ్మదిగా కదిలేవాడు అని అర్థం. ఒకసారి సూర్యుని చుట్టి రావడానికి శనికి 30 సంవత్సరాలు పడుతుంది. శానైస్కర్య, అసిత, సప్తర్చి, క్రూరదృష్ట, క్రూర లోచనుడు, పంగు పాదుడు, గృద్ర వాహనుడు మొదలైన పేర్లుకూడా ఉన్నాయి. సంఖ్యలలో 'ఎనిమిది' శనికి ప్రీతికరమయిన సంఖ్య. ఛాయదేవికి పుట్టిన సంతానం శనిదేవుడు. ఆయనకు ఛాయాపుత్రుడు అనే పేరు కూడా ఉంది. జీవుల జాతక చక్రాలపైన తన ప్రభావాన్ని ఎలా చూప బోతున్నాడో అని నిరూపించడానికి ఆయన జననం సూర్య గ్రహణములో జరిగింది. దేవతల్లో శని దేవుడికి విశిష్టమైన స్థానముంది. జీవులు చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం కల్పించి, శిక్షించి, ధర్మాన్ని నిలిపే శని భగవానుడు యమ ధర్మరాజుకు అన్న. యముడు మరణానంతరం దండనలు విధిస్తే, శనిదేవుడు వారి వారి కర్మ ఫలములను బట్టి జీవులు బ్రతికి ఉండగానే హింసించి, యాతనలకు గురిచేసి శిక్షిస్తాడు. శనీశ్వరుడు గోచారస్థితి ఫలితంగా ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, ప్రభావం పడితే అనేక ఇబ్బందులను కలిగిస్తాడు. హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ చతుర్దశి అనంతరం వచ్చే అమవాస్య రోజు శని జయంతి జరుపు కుంటారు. సూర్యదేవుని కుమారుడైన శని.. జ్యోతిష శాస్త్రం ప్రకారం మానవుల జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తాడు. శనీశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి ఆయన అనుగ్రహం పొందితే కష్టాలు దూరమై.. అదృష్టం కలిసి వస్తుంది. దుష్టశక్తుల నుంచి మనల్ని మనం కాపాడు కోవడానికి శని దేవున్ని ప్రసన్నం చేసుకోవాలి. అంటే తైలాభిషేకం చేసి శాంతి పూజలు నిర్వహించాలి. బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం, పార్వతీ దేవి, నలుగు పిండి బొమ్మకు ప్రాణం పోసినప్పుడు, వినాయకుడు జన్మించాడు. సకల దేవతలు, నవగ్రహాలు ఆ బాల వినాయకుడిని చూడటానికి వచ్చారు. ఆ ముగ్ధ మోహన బాలుడిని అక్కడకు విచ్చేసిన దేవతలు, మునులు కనులార చూసి, దీవెనలు అందించి, పార్వతీ దేవికి మోదం కలిగించారు. శని భగవానుడు మాత్రం తల ఎత్తి ఆ బాలుని చూడలేదు. అందుకు పార్వతీదేవి కినుక వహించి, తన బిడ్డను చూడమని శనిని ఆదేశించింది. అయినా శని తన దృష్టి, ఆ బాల గణపతి పై సారించలేదు. తన దృష్టి పడితే ఎవరికైనా కష్టాలు తప్పవని ఎంత నచ్చచెప్పినా, మాతృ గర్వంతో శనీశ్వరుడి సదుద్దేశం తెలుసుకో లేక, పార్వతీ దేవి తన కుమారుని చూడమని పదే పదే శనిని ఆదేశించింది. శని తల ఎత్తి చూసిన కారణంగా బాల గణపతి మానవ రూపంలో ఉండే తలను కోల్పోయినాడని బ్రహ్మ వైవర్త తదితరాలు తెలుపు తున్నాయి. శని భగవానుని జన్మ వృత్తాంతం విన్న విక్రమాదిత్యుడు ఆయనను పరిహాసమాడాడట! ఆ పరిహాసాన్ని విన్న శని కోపగ్రస్తుడై విక్రమాదిత్యుని శపించాడట. శనిని కించపరిచే విధంగా మాటలాడి, అవమానించి నందుకు ఫలితంగా విక్రమాదిత్యుడు అనేక కష్టాలు అనుభవించాడు. రాజ్యాన్ని పోగొట్టు కున్నాడు, చేయని దొంగతనపు నింద మోపబడి, పొరుగు రాజుచే కాళ్ళు, చేతులు నరికివేయ బడ్డాడు. చివరికి, విసిగి వేసారి పోయి, బాధలు ఏమాత్రం భరించే ఓపికలేక, నిర్వీర్యుడై, భ్రష్టుడై, చేసేదిలేక, తనను కనికరింపమని శనిదేవుని అత్యంత శ్రద్ధతో, ఆర్తితో, భక్తితో ప్రార్థించగా, విక్రమాదిత్యుని భక్తికి సంతృప్తి చెందిన శనీశ్వరుడు తిరిగి అతని పూర్వ వైభవం ప్రాప్తింప చేసాడు. శని దశ దుష్ప్రభావాలతో బాధపడే వారు, భక్తితో శని దేవునికి నూనె సమర్పిస్తే చెడు ఫలితాలు పోతాయని విశ్వాసం. శని దేవతను ప్రతిబింబించే నల్ల వస్తువులను... నల్ల ధాన్యాలు, నల్ల మినపప్పు, నల్ల నూనెలు, నల్ల ఆవులు, నల్ల బట్టలు, మొదలైనవి దానం చేస్తే చెడు ప్రభావాలు తొలగిపోతాయి. చీమలకు బెల్లాన్ని ఆహారంగా ఇస్తే శని సంతుష్టుడై ఉంటాడు. శని స్తోత్రాన్ని నిత్యం పఠిస్తే భగవంతుడి ఆశీర్వాదాలు పొందుతారు. జీవితంలో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొంటోన్న సమయంలో సూర్య దేవుడి కుమారుడైన, శని దేవుడికి పూజ చేస్తే మంచి ఫలితాలుంటాయి. శనివారం ఉపవాసం ఉండి, శనీశ్వరుడి అనుగ్రహం పొందితే అదృష్టం కలిసి వస్తుంది. శని మనిషి చేసిన చెడు కర్మ ఫలితాన్ని తొలగిస్తాడు. జాతక రీత్యా శని పన్నెండవ ఇంట, ఒకటవ ఇంట, రెండవ ఇంట సంచరిస్తున్నప్పుడు, దానిని "ఏలినాటి శని" లేదా "సాడే సాతి" అంటారు. అయితే ఈ సమయంలో శని ఇచ్చే ఫలితం తాత్కాలికంగా చెడు అనిపించినా, అది ఆ వ్యక్తి భవిష్యత్తుకు ఎంతో సహాయ కారిగా ఉంటుంది. పూర్వ జన్మలో చేసిన పాపాల ప్రయత్నాన్ని కష్టాల రూపంలో శని ఈ సమయంలో తొలగిస్తాడు. తద్వారా ఆ వ్యక్తి కి మంచి భవిష్యత్తు కలుగుతుంది. మనం ఎంత కష్టం చేస్తే శని అంతా సంతృప్తి చెందుతాడు. కాబట్టి జాతకంలో కానీ, గోచారంలో కానీ, శని అనుకూలంగా లేని వ్యక్తులు శారీరకంగా కష్ట పడటం, అంటే ఇతరులకు సహాయం చేయడం మొదలైనవి చేస్తే ఆ చెడు ఫలితం తగ్గిపోయి శుభ ఫలితాలను శని ఇస్తాడు.

# నవయుగ వైతాళికుడు వీరేశలింగం



తెలుగులో తొలి నవల రచనకు నాంది పలికిన గొప్ప కవి ఆయన. మొదటి స్వీయ చరిత్ర రాసిన మహోన్నత వ్యక్తి ఆయనే. తెలుగులో తొలి ప్రహసనం వ్రాసింది కూడా ఆయనే. మొట్ట మొదటి వితంతు వివాహం జరిపించిన గొప్పతనం ఆయనదే. ఆయనే నవయుగ వైతాళికుడిగా ప్రఖ్యాత గాంచిన కందుకూరి వీరేశలింగం పంతులు.బాల్యవివాహాల రద్దుకోసం ఉద్యమించిన మహోన్నతుడు, గొప్ప సంఘ సంస్కర్త. మూఢ నమ్మకాలపై యుద్దం ప్రకటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 రాజ మండ్రిలో జన్మించారు. బ్రిటిష్ హయాంలో బాల్య వివాహాల ను నిరసిస్తూ ఆయన పెద్ద ఎత్తున ఉద్యమమే నిర్వహించారు. దీంతోపాటు అనేక సంఘ సంస్కరణలకు పాటు పడ్డారు. సామాజిక దురాచారాల నిర్మూలన కోసం నిరుప మానంగా కృషి చేశారు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన కందుకూరి, బాల్య వివాహాలు రద్దు కోసం ఉద్యమిస్తూనే .. వితంతు వివాహాలు జరిపించాలని కోరేవారు. దేశంలో మొదటి వితంతు వివాహం జరిపింది ఆయనే. సాహితీ వ్యాసంగంలోనూ విశేషంగా కృషిచేశారు కందుకూరి వీరేశలింగం పంతులు. బహుముఖ ప్రజాశాలి అయిన కందుకూరి. మొట్టమొదటి సహవిద్యా పాఠశాలను కూడా ప్రారంభించారు. తెలుగులో తొలి నవల వ్రాసింది. మొదటి స్వీయ చరిత్ర రాసింది కూడా ఆయనే. అంతేగాక తొలి ప్రహసనం కూడా కందుకూరి చేతినుంచి జాలువారింది. కందుకూరి జయంతిని నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటారు. జాతికి నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, మన తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి . సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు, తెలుగు సాహితీ వ్యాసంగంలోనూ నిరుపమానమైన కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. యుగకర్త గా, హేతువాదిగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా అనేక విషయాల లో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు. తెలుగు కవుల జీవిత చరిత్ర రాసిన మొదటి వ్యక్తి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయిత. ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపకులు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశారు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పని చేసా రు. తాము నమ్మిన సత్యాన్ని, సిద్దాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించిన ఆదర్శ వ్యక్తి. యుగకర్త గా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఆంధ్ర సమాజాన్ని సంస్కరణాల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం. ఆయన చేసిన ఇతర సంస్కరణా కార్యక్రమాలొక ఎత్తు, వితంతు పునర్వివాహాలొక ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని విస్తృత ప్రచారం చేసారు.వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘసంస్కరణ, సాహిత్య కృషి రెండింటితో పెనవేసు కు పోయింది. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి అటువంటి దురాచా రాలపై ధ్వజమెత్తి, తన సంస్కరణా భిలాషను నిరూపించు కున్నారు. ఉన్నత విద్యానంతరం వీరేశలింగం అధ్యాపక వృత్తిని చేపట్టారు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరం, మద్రాసులలోని పాఠశాలల్లో పని చేశారు. అధ్యా పకుడిగా పనిచేస్తుండడంతో 'పంతులు'గారని, వీరేశలింగం పంతులుగా రని ప్రాచుర్యం పొందారు. సామా జిక రుగ్మతలను రూపుమాప డానికి 1876లో ఉపాధ్యావృత్తి నుండి జర్నలిస్టుగా మారి 'వివేకవర్థిని' అనే మాసపత్రికను ప్రారంభించారు. మొదట ఈ పత్రిక మద్రాసు నుండి వచ్చేది. తర్వాత కొంతమంది స్నేహితులతో కలిసి, రాజమండ్రి లోనే సొంత ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పత్రికను నిర్వహించారు.ఆ రోజుల్లోనే లంచగొండితనం, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు%ౌ% ఇలా ఎన్నో అన్యాయాలు సమాజంలో జరుగుతుండేవి. వాటిపైకి తన పత్రిక 'వివేకవర్థని'ని ఆయన ఎక్కుపెట్టారు. ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా, ఆచరణాత్మకంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తొలి వితంతు పునర్వివాహాన్ని 11 డిసెంబర్ 1881న తన ఇంట్లోనే జరిపించారు. నవల, వ్యాసం, ఉపన్యాసం, విమర్శ వంటి ప్రక్రియలకు ఆద్యులు. తెలుగులో వచ్చిన తొలి సాంఘిక నవల 'రాజశేఖర చరిత్ర' (1878) పంతులు గారు రాసిందే. సంఘసేవలో వీరేశలింగం ఎంత కృషి చేసారో, సాహిత్యం లోనూ అంతే కృషి జరిపారు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవారు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవారు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకరు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో అద్వితీయ ప్రతిభ కలవారు కందుకూరి. ఆయన 130కి పైగా గ్రంథాలు రాసాడు. అన్ని గ్రంథాలు రాసిన వారు తెలుగులో అరుదు. సాంఘిక దురాచారాలను సంభాషణాత్మకంగా, వినోదాత్మకంగా విమర్శించే ప్రహసనాల వంటి ప్రయోగానికి వీరేశలింగమే ఆద్యుడు.ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం 1919 మే 27 న మరణించారు. వీరేశలింగం గొప్ప సంస్కర్తే కాదు, గొప్ప కవి, రచయిత. తెలుగు సాహిత్యంలో ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. ఆయన రచనలు, కవిత్వాల్లో కూడా అభ్యుదయ భావాలు నిండి ఉండేవి. తెలుగు సాహిత్యంలో ఆయనకు సమున్నతమైన స్థానం ఉంది. నవలలు, కథలు, వ్యాసాలు అన్ని రకాల సాహితీ ప్రక్రియల్లో వీరేశలింగం గారు తన దైన ముద్ర వేశారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకూ వీరేశలింగం ఉంటారు. సంస్కర ణోద్యమం ఉన్నంత వరకూ ఆయన పేరు చిరస్థాయిలో నిలుస్తుంది. ఆయన వ్యక్తి కాదు,గొప్ప వ్యవస్థ అనేది నూటికి నూరుపాళ్లు నిజం.

# కౌలు రైతులపై శీతకన్ను

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతులు (%ఖీుతీఎవతీం%) తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. భూమిపై కౌలు హక్కులు లేకపోవటం వలన ప్రభుత్వ పథకాలకు, పంట నష్ట పరిహారాలకు, సంస్థాగత రుణాలకు దూరమవుతున్నారు. ముఖ్యంగా కౌలు భూమిని పొందటం భూకామందుల ఇష్టాలపై ఆధారపడవలసి వస్తున్నది. భారతదేశం వ్యవసాయిక దేశమని, వ్యవసాయం దేశానికి ఆయువు పట్టని పాలక పార్టీలతోపాటు ప్రతిపక్ష పార్టీలు నిత్యం జపించే మాటలుగా ఉన్నాయి. నేటికీ అత్యధిక ప్రజలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయ రంగం పరిస్థితి, వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్న కౌలు రైతులు, పేద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం ఎడల పాలక పార్టీలు అనుసరిస్తున్న విధానాలు నేడు దేశంలో, రాష్ట్రంలో చర్చించాల్సిన అంశంగా ఉంది. వ్యవసాయానికి సేద్యపు భూమి పునాదిగా ఉంది. ఆ భూమి సేద్యం చేసే వారి వద్ద ఉందా లేక సేద్యం చేయని వారి వద్ద బందీగా ఉందా అన్నదే కీలక అంశం. ఈ అంశమే వ్యవసాయ రంగం స్వరూపాన్ని తెలియచేస్తుంది. అధికార మార్పిడి జరిగి 77 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత కూడా భూసంబందాల్లో మౌలిక మార్పులు జరగలేదు. భూసంస్కరణ చట్టాలు పేదలకు భూములు పంచడంలో విఫలమై అలంకార ప్రాయంగానే ఉన్నాయి. సేద్యం చేసి పంటలు పండించే కౌలురైతుల, పేదరైతులకు సాగు భూమి లేదు. సేద్యం చేయని భూకామందుల వద్ద భూమి కేంద్రీకరణ జరిగింది. ఫలితంగా సేద్యం పై మక్కువ ఉన్న పేదలు భూకామందుల వద్ద భూమిని కౌలుకి తీసుకుని కౌలు దారులుగాను మరి కొందరు కూలీలుగా మారి భూకామందుల దోపిడీకి గురవుతున్నారు. అధికార మార్పిడి జరిగిన ప్రారంభంలో గ్రామీణ జనాభాలో 35% కౌలు రైతులే. కౌలుదారుకి సాగుదారుగా గుర్తింపు లేని పరిస్థితుల్లో దేశంలోని అనేక రాష్ట్రాల్లో హక్కుల కోసం,సేద్యపు భూమి కోసం కౌలు రైతులు, గ్రామీణ పేదలు ఆందోళనా పోరాటాలు చేశారు. ఈ పోరాటాలు కొన్ని ప్రాంతాల్లో మిలిటెంట్ రూపం తీసుకున్నాయి. వాటిల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అతి ముఖ్యమైనది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కౌలుదారీ సంస్కరణలు, భూసంస్కరణలు చేపట్టక తప్పలేదు. కేంద్ర ప్రభుత్వ కౌలుదారీ సంస్కరణల్లో భాగంగా 1950లో తెలంగాణ కౌలుదారీ చట్టం చేయబడింది. ఈ చట్టానికి ముందు వరుసగా ఆరు సంవత్సరాలు కౌలుదారులుగా ఉన్న వారిని రక్షిత కౌలుదారులుగా గుర్తించి వారికి భూమిపై హక్కులు కల్పించారు. సేద్యపు అవసరాల కోసం భూమిని తనకా పెట్టే హక్కు కూడా చట్టం కల్పించింది. నిబంధనల ప్రకారం కౌలు చెల్లించినంత కాలం కౌలుదారుగా కొనసాగుతాడు. కౌలు దారుకి కల్పించిన హక్కులతోపాటు భూయజమాని సొంత సేద్యం చేసుకునే హక్కు చట్టం కల్పించబడింది. దీన్ని ఉపయోగించుకుని భూకామందులు సొంత సేద్యం పేరుతో భూమి నుంచి కౌలుదారులను తొలగించారు. చివరికి కౌలు విధానం రాత పూర్వకం నుండి నోటి మాటకు మారింది. కౌలు రైతులకు ఎటువంటి హక్కులు లేకుండా పోయాయి. ఆచరణలో కౌలుదారీ చట్టం నిరుపయోగంగా మారింది. 1956లో రాష్ట్రాల పునర్వ్యస్థీకరణ చట్టం వచ్చింది. దేశంలోని రాష్ట్రాల సరిహద్దులు మారాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఒకే రాష్ట్రంగా ఏర్పడింది. 1956 లో ఆంధ్రప్రదేశ్ కౌలుదారీ చట్టం ఆనాటి ప్రభుత్వం చేసింది. ఇది ఆంధ్రా ప్రాంతానికే పరిమితం. తెలంగాణలో 1950 కౌలుదారీ చట్టమే అమల్లో ఉంది. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో తెచ్చిన కౌలుదారీ చట్టంలో లైసెన్స్ పొందిన కౌలు రైతులకు సంవత్సర ప్రాతిపదికన అర్హత కార్డులు ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. తెలంగాణలో అప్పటికి ఉన్న 17.4 లక్షల కౌలు రైతుల్లో 6.8 లక్షల మంది అర్హత కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా 2011- 12లో 5.1 లక్షల మందికి మాత్రమే కార్డులు ఇచ్చారు. 2012-13లో 4.1 లక్షల మంది కౌలుదారులకే కార్డులు పరిమితమయ్యాయి. ఈ కార్డులు కూడా బ్యాంకుల నుంచి కౌలు రైతులకు పంట రుణాలు అందించలేక పోయాయి. అందుకు కారణం రైతుల అనుమతి పత్రం లేకపోవటమే. ఈ చట్టం కూడా కౌలు రైతులను మభ్యపెట్టి వారి సమస్యలను పక్కదారి పట్టించేందుకు తెచ్చిందే. 2014లో ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టిన కెసిఆర్ అసలు కౌలు రైతులనే గుర్తించలేదు. ఇది ఫ్యూడల్ అహంకారంనుంచి వచ్చిందే. రేవంతరెడ్డి ముఖ్యమంత్రిగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కౌలు రైతుల పరిష్కార విధానాలు చేపట్టలేదు. తెలంగాణలో 2021 -22లో వ్యవసాయ గణాంకాల లెక్కల ప్రకారం 63.12 లక్షల హెక్టార్ల భూవిస్తీర్ణంలో మొత్తం కమతాల సంఖ్య 64 లక్షలు. అందులో దాదాపు 22 లక్షల కమతాలు కౌలు రైతులవే. వారి సాగు చేస్తున్న భూమి 42% గా ఉంది. ప్రతి ముగ్గురు రైతుల్లో ఒకరు కౌలురైతే. 91% కౌలు చెల్లింపు నగదు రూపంలో ఉండగా, 7.5 శాతం పంట రూపంలో చెల్లిస్తున్నారని, 38.3% ఒప్పంద సమయంలోనే పూర్తిగా కౌలు చెల్లిస్తుంటే, 20.5% సగం కౌలు ముందు సగం తర్వాత చెల్లిస్తున్నారని, 41% కౌలు పంట కోతల తర్వాత చెల్లిస్తున్నారని రైతు స్వరాజ్ వేదిక స్టడీ తెలియచేస్తున్నది. రాష్ట్రంలో కౌలు రైతుల సంఖ్య, కౌలు భూమి విస్తీర్ణం నిరంతరం పెరుగుతూ ఉంది. అత్యధిక మంది కౌలుదారులు ముందుగానే కౌలు డబ్బులు చెల్లించి భూమి సాగు చేస్తున్నారు. పంట నష్టపోయిన సందర్భంలో ఎటువంటి సహాయం అందక అప్పుల్లో కూరుకుపోతున్నారు. భూమిని కౌలుకు ఇవ్వటం ప్రోత్సహించాలని ప్రపంచ బ్యాంక్ చెప్పినందుకు భారతదేశ రాష్ట్ర ప్రభుత్వాలు, భూసంస్కరణలు అమలు జరపకుండా భూమిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే వ్యవసాయ విధానాలు రూపొందిస్తున్నారు. దీన్ని సమర్థించుకోవటానికి చిన్న కమతాల వ్యవసాయం లాభదాయకం కాదని, ఉత్పాదక పెరగదనే ప్రచారం ప్రారంభించారు. వాస్తవంగా చిన్న కమతాల వల్లే ఎక్కువ దిగుబడులు వస్తున్నాయని అనేక సర్వేలు వెల్లడించాయి. మోడీ ప్రభుత్వ సూచనల మేరకు నీతిఆయోగ్ భూమిలేని పేదల వ్యవసాయ సామర్థ్యం మెరుగు పరచటం కోసమంటూ 2016లో వ్యవసాయ భూమి కౌలుపై నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోగల వ్యవసాయ భూమి లీజింగ్‌పై నమూనా చట్టం రూపొందించింది. ఈ నమూన చట్టంలో ప్రభుత్వ అందించే అన్ని రకాల సహాయాలకు కౌలురైతులు అర్హులు అయ్యే విధంగా చట్టం రూపొందించినట్లు చెప్పింది. యజమానికి పూర్తి భద్రత కల్పిస్తూ, కౌలు రైతుకు భూమిపై ఎటువంటి హక్కు ఉండదని, దీర్ఘకాలికంగా భూమిని కౌలుకు తీసుకున్న వారసత్వంగా భూమిని పొందలేడని, ఎలాంటి సమయంలోనైనా కౌలుదారుని ముందుగా హెచ్చరించి కౌలు రద్దు చేసుకోవచ్చని నమూన చట్టంలో పేర్కొన్నారు. భూపంపిణీ గురించి చట్టంలో ప్రస్తావనే లేదు. గత కౌలుదారీ చట్టాల్లోనూ, నీతిఆయోగ్ నమూనా చట్టంలో గాని కౌలురైతుకు ఎటువంటి హక్కులు లేవు. భూయజమాని ఇష్టాయిష్టాలపై భూమి కోసం కౌలు రైతు ఆధారపడి ఉండాలి. ఇలాంటి చట్టాలు కౌలు రైతుల సమస్యలు పరిష్కరించవు. మానవ మనుగడకు వ్యవసాయం ప్రధాన జీవనాధారం. అలాంటి వ్యవసాయంలో ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతాంగం పరిస్థితి ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. సేద్యపు ఖర్చులు ఎక్కువ కావటం, అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించకపోవటం, సంస్థాగత రుణాలు అందక అధిక వడ్డీలకు అప్పులు చేయటం, ప్రభుత్వం ప్రకటించే పరిహారాలు అందకపోవటం వల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్కో రైతు కుటుంబంపై 1,53,113 ఉండగా, కౌలు రైతు కుటుంబాలు మాత్రం సగటున 2.70 లక్షల రూపాయల అప్పుల్లో ఉన్నారు. ఇందులో రెండు లక్షలు ప్రైవేట్ వ్యక్తుల నుండి అధిక (24% నుండి 60% వరకు) వడ్డీలకు అప్పులు తీసుకున్నారు. రైతుల ఆత్మహత్యల్లో కూడా కౌలు రైతులు సంఖ్య ఎక్కువగానే ఉంది. పాలక ప్రభుత్వాలన్నీ భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను కాపాడుతూ పేద, కౌలు రైతుల వ్యతిరేక విధాలు అనుసరిస్తూ ఉన్నాయి. ప్రభుత్వాలు చేసిన కౌలు చట్టాలన్నీ అందుకు అనుగుణంగానే ఉన్నాయి. ఈ చట్టాలేవి కౌలు రైతుల సమస్యలు పరిష్కరించలేక పోయాయి.

# బట్టీ చదువులు భవిష్యత్తుకు చేటు


## బట్టీ చదువులు వద్దు- ఆత్మస్థైర్యాన్ని నింపే చదువులు ముద్దు!

అనంతపుర్, మే 26(సూర్య ప్రతినిధి):
ఈ రోజుల్లో చదువు అనేది పిల్లల జీవితాల్లో ఓ భయంగా, ఓ భారం గా, ఓ పోటీగా మారిపోయింది. "పాస్ అవ్వాలి, ర్యాంక్ రావాలి, ఉద్యోగం రావాలి, అప్పుడే జీవితం సెటిల్" అనే ఒకే విధమైన లక్ష్యంతో నడుస్తున్న విద్యా వ్యవస్థ, నిజమైన విజ్ఞానాన్ని కాకుండా మార్కులను మాత్రమే అంగీకరించే విధంగా రూపాంతరం చెందుతోంది.. చిన్నచిన్న పిల్లలకే మోయలేని బ్యాగుల బరువులు చిన్న తనంలోనే నడుము వంగిపోయి అవస్థలు పడడం, చదువుల ఒత్తిడితో చిన్నతనంలోనే కంటి చూపు మందగించడం నేటి పిల్లలకు శాపంలా మారింది.
ఈ దృష్టికోణం యువతను చదువు పట్ల అసహనంతో నింపుతుంది. చదువు అనేది జీవన నైపుణ్యాన్ని కల్పించాలి కానీ ఒత్తిడిని పెంచకూడదు. కానీ ఈ రోజు పరిస్థితి చూస్తే, చదువు విద్యార్థులకు భారం అయింది %-% అది భవిష్యత్తును నిర్మించక, నిస్సారంగా మారుస్తోంది.
ఒక విద్యార్థి పరీక్షలలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధిస్తాడు కానీ అతనికి జీవితంలో ఎదురయ్యే చిన్న సమస్యలను కూడా ఎదుర్కునే ధైర్యం ఉండదు అలా చాలా మంది విద్యార్థులు నేటి సమాజంలో చదువులో రాణిస్తున్నారు కానీ జీవితంలో విఫలమవుతున్నారు, ఇది మన విద్యావిధానానికి పెను సవాలుగా మారింది

బట్టీ చదువు అంటే ఏమిటి?
బట్టీ చదువు అనేది అవగాహన లేకుండా పాఠ్యాంశాలను యాంత్రికంగా గుర్తుపెట్టుకోవడం. ఇది చిన్నపాటి మెమరీ గేమ్ మాత్రమే. దాన్ని పరీక్షలో వాంతి చేసి బయటపెడతారు. తరువాత మిగలేది? శూన్యం! ఈ పద్ధతిలో చదివిన విద్యార్థులు జీవితంలోని అసలైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేరు. పరిచయ సమస్యలు, ఆచరణలో ఎదురయ్యే సవాళ్ళను తట్టుకోలేరు. దీని వలన వారు మరింత అస్థిరతకు లోనవుతారు.

బట్టీ చదువు దుష్పరిణామాలు:
ఆత్మవిశ్వాస లోపం:
చదివినది అర్థం కాకపోవడం వల్ల నిర్ధారణ లేకుండా ఒక నిర్ణయానికి రావడం , ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకోలేకపోవడం
సొంత తెలివి ఉపయోగించలేరు :
ప్రశ్నల వెనుక ఉన్న భావాన్ని పట్టుకోలేరు, స్వతంత్రంగా ఆలోచించలేరు.
సృజనాత్మకత లోపించడం:
కొత్తగా ఆలోచించగల శక్తి లేకుండా తయారవుతారు సమస్యలపై స్వయం నిర్ణయం తీసుకునే ధైర్యం లేకుండా మారతారు.
మానసిక ఒత్తిడి:
మార్కుల భయం, తల్లిదండ్రుల అంచనాలు, సమాజపు వత్తిడితో మానసిక స్థైర్యం కోల్పోతున్నారు.

అయితే చదువుకి అసలైన అర్థం ఏమిటి?
విద్య అంటే...
మంచి వ్యక్తిగా తయారవడం
ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం
జీవిత సమస్యలకు పరిష్కారం చూపగలగడం
విద్య అంటే "జ్ఞానం ,ఆచరణ , ఆత్మస్థైర్యం". ఇది ఏదో పుస్తక జ్ఞానంతో పరిమితం కాక, జీవితాన్ని అర్థం చేసుకునే దిశలో ఉండాలి.



నిజమైన విద్య ఎలా ఉండాలి?
అభిరుచి ఆధారంగా కోర్సులు:
ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. అందరినీ ఒకే తాటిపై కట్టే ప్రయత్నం కాకుండా, ప్రతి ఒక్కరి ఆసక్తిని గుర్తించి, దాన్ని అభివృద్ధి చేసేలా విద్యావిధానం ఉండాలి.
జీవిత విద్య :
పిల్లలకు పరీక్షల్లో ఉత్తీర్ణతకన్నా ముందుగా, జీవనంలో ఎలా నడవాలో నేర్పించాలి. ఆత్మస్థైర్యం, కమ్యూనికేషన్, నిర్ణయాలు తీసుకునే శక్తి వంటి జీవన నైపుణ్యాలు ప్రధాన పాత్ర పోషించాలి.
ప్రయోగాత్మక విద్య :
పుస్తకాల నుంచి కన్నా, అనుభవ పూర్వకంగా క్షేత్ర స్థాయిలో స్వయంగా నేర్చుకునే పాఠాలే విద్యార్థులలో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి , దీర్ఘకాలికంగా గుర్తుండే అవకాశం వుంది, జీవితంలో సమస్యల సాధనకు కూడా ప్రయోగాత్మక విద్య ఎంతో సహాయ పడుతుంది
విలువలతో కూడిన విద్య:
విద్యార్థులలో నైతికత, మానవత, సానుభూతి వంటి విలువలు పాఠ్యాంశాలతో పాటు మిళితమై ఉండాలి. మార్కుల కన్నా మానవతా విలువలు వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దుతాయి.



తల్లిదండ్రులు తెలుసుకోవాల్సింది:
మార్కులు జీవితాన్ని నిర్వచించవు. పిల్లలు మంచి మార్కులు,ర్యాంక్ సాధించకపోయిన వారిని నిందించకండి. వారి లోపాలను గుర్తించి, మానసికంగా వారిలో ధైర్యాన్ని. విశ్వాసాన్ని నింపాలి అదే తల్లిదండ్రులు వారి పిల్లలను నిజమైన విజేతలగా తీర్చిదిద్దడానికి దోహదపడుతుంది
ఉపాధ్యాయులు ఆలోచించాల్సింది :
మీరు బోధించేది పాఠ్యాంశం మాత్రమే కాదు, ఓ జీవన దిశ. విద్యార్థుల్లో ఆలోచన, ప్రశ్నించే ధైర్యం, విశ్లేషణ, జ్ఞానాన్ని వినియోగించే నైపుణ్యాన్ని పెంపొందించాలి. మార్కులు పొందే విద్యార్థులు కాక, మార్గదర్శకులు తయారు చేయండి.
విద్యార్థులు గుర్తుంచుకోవాల్సింది :
మీరు చదివేది పుస్తకం కాదు %-% ఒక జీవితాన్ని నిర్మించే సాధన. మార్కులు మీ విజయాన్ని నిర్వచించవు. మీరు ఎంతగా సమస్యలను అర్థం చేసుకుని, వాటిని ఎదుర్కొనే ధైర్యాన్ని పెంచుకుంటారో, అదే మీ నిజమైన విజయానికి మూలం.
ఈ మార్పు: కుటుంబం నుంచి పాఠశాల నుంచి విద్యావిధానం నుంచి మాత్రమే కాక
ప్రధానంగా అందరి మనసుల నుంచి రావాలి. పిల్లలకు భయాన్ని కాదు, లక్ష్యం వైపు నడిపించే ధైర్యాన్ని కలిగించే చదువు అవసరం.

జి. అజయ్ కుమార్
వ్యక్తిత్వ వికాస నిపుణులుం

# ఈనెల 30న కలెక్టరేట్ వద్ద ధర్నాకు వందలాదిగా తరలి రండి





తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ

**చౌటుప్పల్, మే 26(సూర్య ప్రతినిధి):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని ఈ నెల 30న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు వందలాదిగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు తరలి రావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చౌటుప్పల మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని మందోల్లగూడెం, దర్మోజిగూడెం గ్రామాలలోని ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్న అనంతరం నర్సింహ పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వారం వారం డబ్బులు చెల్లించకపోతే తమ కుటుంబాలను ఏ విధంగా పోషించుకుంటారని ప్రశ్నించారు. పేరుకు ప్రభుత్వము రోజు కూలీ 307 రూపాయలు నిర్ణయించిన 150 నుండి 230 రూపాయలు దాటడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా కొలతలతో సంబంధం లేకుండా నిర్ణయించిన రేటు కాకుండా రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 6 కోట్ల పని దినాలు అవసరము ఉంటే మోడీ ప్రభుత్వం 3 కోట్ల పని దినాలు మంజూరు చేస్తే మరి మిగతా రోజులు కార్మికులు ఏమి పని చేయాలని నర్సింహ ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వము సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను గ్రామాలతో పాటు పట్టణాలలో కూడా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీలు ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను, ఫీల్డ్ అసిస్టెంట్లను భర్తీ చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వానికి సూచించారు.

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు మాట్లాడుతూ పని ప్రదేశంలో తాగడానికి నీళ్లు, నీడ కోసం టెంట్, పని ప్రదేశంలో గాయపడితే చికిత్స అందించడానికి మెడికల్ కిట్టు తక్షణమే ఏర్పాటు చేయాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి వారికి పని కల్పించాలని, నూతన జాబులు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడితే రోజు కూలీ కట్టి ఇవ్వాలని, చనిపోతే 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, వాచర్సును, మెట్లను గుర్తించి అర్హత కలిగిన వారందరికీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలని వీటి సాధన కోసం ఈనెల 30న నిర్వహిస్తున్న కలెక్టరేట్ ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బొజ్జ బాలయ్య, జిఎంపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కొండె శ్రీశైలం, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు యాట ముత్యాలు, జంగం అంజయ్య , పెంటారెడ్డి, సిఐటియు నాయకులు కొంతం శ్రీనివాస్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ చెనబోయిన జ్యోతి, ఉపాధి హామీ కార్మికులు యాదిరెడ్డి, అంజయ్య, పగిళ్ల అనుజ, నీళ్ల కావ్య, యాట బక్కయ్య, గంట సప్న, నీళ్ల రేణుక, కవిత, సప్పిడి రాములమ్మ, అంజమ్మ, బుచ్చమ్మ, జంగమ్మ, జ్యోతి, సప్పిడి కృష్ణారెడ్డి, యాట ఎట్టయ్య, నీళ్ల యాదగిరి, జే శ్రీలత, వై పద్మ, అనిత, నిర్మల, శంకరమ్మ, అనసూయ, మంగ, బుచ్చమ్మ, సునీత, అమృత, పద్మ, ఇంద్ర, లావణ్య, శైలజ, జయమ్మ, వసంత తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడి

**30 వేల రూపాయలు లంచం తీసుకుంటూ సబ్ రిజిస్ట్రార్ అరుణ, డాక్యుమెంట్ రైటర్ అడ్డంగా దొరికిన ఘటన**



ఖమ్మం, సూర్య ప్రతినిధి
ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారులు అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు. రిజిస్ట్రేషన్ సంబంధిత పనులకు లంచం తీసుకుంటూ సబ్ రిజిస్ట్రార్ అరుణ, డాక్యుమెంట్ రైటర్ ఇద్దరూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వీరిద్దరూ రూ.30,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి అడ్డంగా దొరికారు. సమాచారం అందుకున్న అనంతరం ఏసీబీ అధికారులు కార్యాలయంలో సోదాలు నిర్వహించి వారి వద్ద నుంచి ఆధారాలతో పాటు డబ్బును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి, అవినీతి ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో బైక్‌పై వెళ్తున్న కుటుంబం పై తీగ పడి విషాదం

**మేడ్చల్ కీసరలో విషాద ఘటన**
**మౌనిక మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు**



రంగారెడ్డి జిల్లా, సూర్య ప్రతినిధి
మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం మరో కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో ఈదురు గాలులకు తెగిపోయిన విద్యుత్ తీగ ఓ కుటుంబం మీద పడిన దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సురేష్, ఆయన భార్య మౌనిక, మూడేళ్ల కుమారుడు శ్రేయాస్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా అకస్మాత్తుగా పై నుంచి విద్యుత్ తీగ మీద పడింది. దీంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మౌనిక మృతి చెందింది. ప్రస్తుతం సురేష్, శ్రేయాస్‌ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విద్యుత్ తీగలు ఖచ్చితమైన భద్రత లేకుండా ఉండటం, అలాంటి పరిస్థితుల్లో అధికారుల నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కోహెడలో భూ సర్వేకు వ్యతిరేకంగా రైతుల ఆందోళన






**తుర్కయంజాల్, సూర్య ప్రతినిధి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ గ్రామంలోని రైతులు ప్రభుత్వ భూముల సర్వే చర్యలకు తీవ్రంగా వ్యతిరేకించారు. రెవెన్యూ సర్వే నెంబర్ 167/1లో ఉన్న సుమారు 200 ఎకరాల భూమిపై అధికారులు చేపట్టిన సర్వేతో రైతుల్లో తీవ్ర ఆగ్రహం నెలకొంది. ఈ భూములను 90 ఏళ్లుగా సాగు చేస్తోన్నామని, అప్పటి ప్రభుత్వం రైతులకు ఏక్ సాల్ పట్టాలు కూడా ఇచ్చిందని రైతులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు ముందు ఈ భూములను ఒక ప్రైవేట్ కంపెనీకి అప్పగించేందుకు జరిగిన యత్నాన్ని కూడా రైతులు అడ్డుకున్నారు. ప్రస్తుతం మళ్లీ సర్వే చర్యలు చేపడుతున్నందుకు వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ సీనియర్ నాయకుడు కందాల బలదేవరెడ్డి నేతృత్వంలో రైతులు భూముల వద్ద ఆందోళన చేపట్టి, ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించారు. "రైతులతో చర్చలు లేకుండా భూములను తీసుకునేందుకు యత్నిస్తే ఊరుకోరు" అని బలదేవరెడ్డి హెచ్చరించారు. భూమికి భూమి ఇవ్వకపోతే కోహెడ రైతులు ఎటువంటి వెనుకడుగు వేయబోరని స్పష్టం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో గంగని శ్రీనివాస్ కురుమ, జూలు మల్లేశ్, పోచిగారి వెంకటేశ్, శీలం మానయ్య తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు. రైతులు మా భూములు మాకు కావాలి సర్వే రద్దు చేయాలి అంటూ నినాదాలు చేశారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ రైతుల గుర్తింపు సంఖ్య తప్పనిసరి

**సూర్య ప్రతినిధి మఠ్రిగూడ** రైతులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అందించే సంక్షేమ పథకాల లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ 11 అంకెల రైతు గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి అని మండల్ అగ్రికల్చర్ ఆఫీసర్ ఏవో సహా స్ ఒక ప్రకటనలో తెలియజేశారు కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు భూభారతి పోర్టల్ లో భూమి కలిగిన ప్రతి రైతు ఇది గమనించి ఆధార్ కార్డు తమ గ్రామంలో ఉన్న పట్టా పాస్ బుక్ ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబర్ మండలం లో ఆయా క్లస్టర్ల ఏవోల దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోగలరు అదేవిధంగా మండలంలోని ఎఫ్ ఎస్ సి ఎస్ శివన్నగూడలో సబ్సిడీపై 10 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని విత్తనాలు 30 కేజీల బ్యాగు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన జెర్కోనీ రాజు



**ఇబ్రహీంపట్నం, సూర్య ప్రతినిధి :** మానవతా విలువల పరిరక్షణకు మన సమాజంలో ఇంకా మంచితనాన్ని చాటిచెప్పే వ్యక్తులు ఉన్నారు అనే నమ్మకాన్ని కలిగించే ఉదంతం ఇది. ఇబ్రహీంపట్నం నికి చెందిన తన స్నేహితుడు మంకాల రాజు (మంగళ్ రాజు) అకాల మరణ వార్తతో ముక్తాదంగా కలిచిపోయిన జెర్కోనీ రాజు ఆ కుటుంబానికి భరోసా గా నిలిచారు. రాజు, మృతుని కుటుంబాన్ని స్వయంగా కలిసి, వారి పిల్లల విద్య భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రూ. 50,000 ఆర్థిక సహాయం అందించారు. అంతే కాకుండా, "వారి చదువులకు భవిష్యత్తులో అవసరమైన ఏ సహాయం అయినా వెనుకాడను" అంటూ హామీ ఇచ్చారు.ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులే గొప్పవి" అనే సూక్తిని ఆచరణలో చూపించిన జెర్కోనీ రాజుకు పలువురు ప్రేమ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సంఘటన ప్రజల్లో మానవీయతను పెంపొందించేలా ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## ఇండోనేషియా బలిలో వ్యవసాయ అభివృద్ధి సదస్సు

**హాజరైన టీజీకాబ్ చైర్మన్ రవీందర్ రావు, వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య**






**తుర్కయంజాల్, సూర్య ప్రతినిధి :** ఇండోనేషియా బలిలో జరుగుతున్న ఏషియా పసిఫిక్ రూరల్ అండ్ అగ్రికల్చరల్ క్రెడిట్ అసోసియేషన్ అంతర్జాతీయ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర సహకార గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ (టీజీకాబ్) చైర్మన్ రవీందర్ రావు, వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ప్రతినిధులుగా హాజరైనట్లు ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సదస్సులో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి, వృత్తాకార ఆర్థిక సేవల విస్తరణ, గ్రామీణ క్రెడిట్ రంగంలో సమకాలీన సవాళ్లు, డిజిటల్ ఫైనాన్స్ వంటి కీలక అంశాలపై విశ్లేషణాత్మక చర్చలు జరిగాయి. వివిధ దేశాల అనుభవాలను పంచుకుని, బహుపాక్షిక భాగస్వామ్యంతో వ్యూహాత్మక అభివృద్ధికి మార్గాలు అన్వేషించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం.ఈ సందర్భంగా భారత్ తరపున పలువురు డీసీసీబీ చైర్మన్లు కూడా పాల్గొన్నారు. ముఖ్యంగా భోజ రెడ్డి, కుంభం శ్రీనివాస్ రెడ్డి, రమేష్ రెడ్డి, దేవేందర్ రెడ్డిలు కూడా ఈ కార్యక్రమంలో భాగమయ్యారు. వారంతా గ్రామీణ రుణ వ్యవస్థలో తెలంగాణ మోడల్‌ను వివరించి ఇతర దేశాల ప్రతినిధుల ప్రశంసలు పొందారు. ఈ సమావేశం గ్రామీణాభివృద్ధిలో నూతన దిశను సూచిస్తుందని పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

## సుధాకర్ రెడ్డి తల్లి రాజమ్మకు ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**26 గండిపేట్ 02 గండిపేట్ : సూర్య ప్రతినిధి** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్దేవపల్లి డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సుధాకర్ రెడ్డి తల్లి, కీ?శే? రాజమ్మ ఇటీవల పరమపదించగా, ఆమె దశదిన కర్మ కార్యక్రమం ప్రజా భవన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై, ఆమె చిత్రపటానికి పుష్పమాలలు సమర్పించి, హృదయపూర్వకంగా నివాళులర్పించారు. అనంతరం సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎప్పటికీ కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు.ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు హాజరై, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# ఈనెల 30న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయండి





**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య**

**భువనగిరి, మే 26(సూర్య ప్రతినిధి):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 30న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య పిలుపునిచ్చారు. సోమవారం భువనగిరి మండల పరిధిలోని నందనం, అనాజిపురం గ్రామాల్లోని ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించిన అనంతరం కార్మికులను ఉద్దేశించి అంజయ్య మాట్లాడుతూ 2005లో అనేకమంది వ్యవసాయ కార్మికులు వామపక్ష పార్టీ ప్రజా సంఘాల పోరాట ఫలితంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టము ఏర్పడితే నేటి బిజెపి మోడీ ప్రభుత్వం చట్టాన్ని ఎత్తివేయాలను కుంట చేస్తుందని ఈ కుట్రలను కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 100 రోజుల నుండి 200 రోజుల వరకు పని దినాలను కల్పించాలని, రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని, పని ప్రదేశంలో నీడ కోసం టెంటు, తాగడానికి నీళ్లు, మెడికల్ కిట్టు ఏర్పాటు చేయాలని, దరఖాస్తు చేసుకున్న వారికి జాబ్ కార్డుతో పాటు పని చూపించాలని, వారం వారము చేసిన పనికి డబ్బులు చెల్లించాలని, ఖాళీగా ఉన్న ఉపాధి హామీ సిబ్బందిని నియమించాలని, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న ధర్నాలలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని అంజయ్య కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొండపురం యాదగిరి, రైతు సంఘం జిల్లా నాయకులు ఎదునూరి మల్లేశం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉపాధి హామీ కార్మికులు కొల్లూరి సిద్దిరాజు, సురివి పద్మ, అల్లంపల్లి భారతమ్మ, కడారి మల్లయ్య, బొల్లెపెల్లి బుచ్చమ్మ, సుగుణమ్మ,యండి. శాందిపాష , తెల్జురి బాలమ్మ, కంచం నీలమ్మ, షేక్ నజీమా, యాట సావిత్రి, యశోద, లక్ష్మమ్మ, రాణి, సత్తయ్య, పద్మ, శోభా, నాగరాణి, సుమలత, సరిత, జయమ్మ, పద్మ, అంసమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్‌కు చొరవ

**-బీజేఎంసీ కమిషనర్ శరత్ చంద్ర**




**గండిపేట్, : సూర్య ప్రతినిధి** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో సాలీడ్ వేస్ట్‌ల నిర్వాహణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కార్పోరేషన్ కమిషనర్ శరత్ చంద్ర అన్నారు. సోమవారం కార్పోరేషన్ పరధిలోని కొత్వాల్ గూడలో డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్, కంపోస్టు తయారీ ప్రక్రియను కమీషనర్ బి.శరత్ చంద్ర పరిశీలించారు. ప్రతి ఇంట్లో నుంచి సేకరించిన చెత్తలో వచ్చిన పొడి చెత్తను రీ-సైకిల్ చేసి రీ-యూస్ చేయాలని, తడి చెత్తతో కంపోస్టు తయారీ చేసి మొక్కలకు సేంద్రియా ఎరువుగా ఉపయోగించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ శరత్ చంద్ర మాట్లాడుతూ.. కార్పోరేషన్ పరిధిలో సేకరించే చెత్తను రీసైకిల్ చేయడం జరుగుతుందని వివరించారు. ఈ మేరకు సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు నరేందర్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో అభివృద్ధిలో అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

**ఏసీఎఫ్ ఆఫ్ బీజేఎంసీ సభ్యులు**



**గండిపేట్, : సూర్య ప్రతినిధి**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఏసీఎఫ్ ఆఫ్ బీజేఎంసీ సభ్యులు తెలిపారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని గంధంగూడ శ్రీనివాస్ నగర్ కాలనీకి రూ.23 లక్షల విలువైన 2 సీసీ రోడ్లు మంజూరు చేయడంతో సోమవారం కార్పోరేషన్ కమిషనర్ కు వర్క్ ఆర్డర్ కాపీని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏసీఎఫ్ ఆఫ్ బీజేఎంసీ కమిటీ సభ్యులు వినయ్ రెడ్డి, నరేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి పెద్దపీట





**గండిపేట్, : సూర్య ప్రతినిధి** మణికొండ మున్సిపాలిటీలో ప్రజల సమస్యల కోసం నిరంతరం బీఆర్ఎస్ పార్టీ తరపున పని చేయడం జరుగుతుందని మున్సిపాలిటీ మణికొండ బిఆర్ఎస్ పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ అన్నారు. సోమవారం గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట మణికొండ పరిధిలోని అల్కాపూర్ టౌన్షిప్ రోడ్డు 4, 2,5 మార్గమధ్యంలో బిఆర్ఎస్ పార్టీ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా పలు సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా మొదట్లో వేసిన చిన్నపాటి డ్రైనేజ్ పైప్ ల ద్వారా మురికి నీరు, వర్షపు నీరు సాఫీగా వెళ్ళలేక, బయటకు వెళ్లగక్కుతూ ప్రవహించడం వల్ల వీధులన్నీ మురికి కుపమై దోమలకు నిలయమౌతున్నాయని పై పెచ్చు ఖాళీగా ఉన్న ప్లాట్ లు చెత్తా చెదారంతో నిండి ఉన్న కారణంగా వర్షము వలన తడిసి ముద్దగా మారి కంపు వాసన వెదజల్లుతూ అక్కడ కూడా దోమలకు నిలయమై విలయ తాండవం చేస్తున్నావని తమ వ్యధను వెళ్లబోసుకున్నారు. మున్సిపల్ అధికారులు ఆస్తి పన్ను వసూలు మీద ఉన్న శ్రద్ధ ప్రజా అవసరాలు తీర్చడంలో చూపడం లేదని ప్రజాభిప్రయ సేకరణలో తేలిందన్నారు. రహదారులు మొత్తంగా దెబ్బ తిని గుంతలమయంగా మారినా మునిసిపల్ అధికారులు మౌనంగా ఉండటం పట్ల మండిపడ్డారు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఎదుర్కుంటున్నామని వాపోయారు. జలమండలి లైన్ మెన్ ల బదిలీలు చేయనందున వారి ఇష్టానుసారం వ్యవహరిస్తూ నీటి సరఫరా చేస్తున్నారని తెలియజేశారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధాన కార్యదర్శి గుట్టమీది నరేందర్, బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి, ఏర్పుల శ్రీకాంత్, సంఘం శ్రీకాంత్, యాలాల కిరణ్, భాను చందర్, సుమనళిని, చెరుకూరి బాలాజీ, రాజేంద్రప్రసాద్, కందాడ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలిమినేడులో ఇందిరమ్మ ఇల్లు ముహూర్తం గ్రామ ప్రజల ఆశయానికి శ్రీకారం



**ఇబ్రహీంపట్నం, సూర్య ప్రతినిధి :** మండలంలోని ఎలిమినేడులో గ్రామంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు కోసం ముగ్గు వేసి ముహూర్తం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. గ్రామస్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని ప్రజలకు చేరువచేసే దిశగా ఈ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలిచిందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఇలా ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసేందుకు స్థానిక నాయకత్వం చూపుతున్న చొరవపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంకల శేఖర్ రెడ్డి,పట్నం బీరప్ప, గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి, పట్నం శివశంకర్, పొగాకు స్వామి, కొట్టముల శ్రీశైలం, గట్టు జంగయ్య, హనుమంత్,సెక్రటరీ రవి, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలోనే పేదల సంక్షేమం








**గండిపేట్, : సూర్య ప్రతినిధి** కాంగ్రెస్ పాలనతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలోని పేదలకు ప్రభుత్వం అనేక అనేక పథకాలను ప్రవేశపెట్టి ఎంతో మేలు చేస్తుందన్నారు. నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో మంజూరు అయిన 238 ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు ఆయన సోమవారం కోకాపేటలో మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల కష్టసుఖాలు తెలిసినవారని వారికి అవసరమైన అన్ని రకాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ పథకాలను అందుకున్న వారు వాటిని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఆయన సూచించారు. పేద ప్రజల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా ఇవ్వడం చరిత్రలోనే మొదటిసారి అని, వాటిని ప్రతి ఒక్కరు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో అధికారులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని వారికి సహకరించి అన్ని వార్డులను అభివృద్ధి చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని నాయకులకు ఆయన సూచించారు. పనిచేస్తున్న అధికారులను తప్పు పట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ఇందిరమ్మ గృహాలు రానివారు ఇంకా ఎవరైనా ఉంటే రాబోయే రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని వారందరికీ మంజూరు అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నార్సింగ్ మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్ యాదవ్ లతోపాటు మాజీ కౌన్సిలర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ఎంట్రీ



**హైదరాబాద్ :** తెలంగాణలోకి రుతుపవనాలు ప్రవేశించాయి. దక్షిణ తెలంగాణ ప్రాంతంలోని గద్వాల్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్గొండలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. వచ్చే 24 గంటల్లో హైదరాబాద్ నగరంతో సహా మధ్య తెలంగాణలోకి రుతుపవనాలు మరింత ముందుకు సాగుతాయని తెలంగాణ వెదర్ మ్యాన్ తెలిపారు. తెలంగాణలో తేలికపాటి నుండి ఒక మోస్తారు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉంది. రాబోయే 3 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 నుంచి 7 డిగ్రీలు తక్కువగా నమోదు కానున్నాయి. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సిద్ధిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్ జిల్లాలలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు. గంటకు 30-40 కి. మీ వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## ఆడపిల్ల పుట్టిందని సంబరాలు

**మెదక్, :** బ్బాయి పుడితే అదేదో ప్రపంచాన్ని జయించిన ట్లుగా ఫీలవుతుంటారు. అమ్మాయి కంటే అబ్బాయికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారు. కానీ ఈ పరిస్థితి ఇప్పుడిప్పుడే మారుతుంది. ఆడపిల్ల పుడితే తమ ఇంటికి ప్రిన్సెస్ వచ్చిందనే భావించే మనుషులు తారసపడుతున్నారు. తాజాగా మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఆడబిడ్డను అలానే ట్రీట్ చేసింది ఓ కుటుంబం. ఇంటికి మహాలక్ష్మి లాంటి ఆడబిడ్డతో వచ్చిన దంపతులకు పూలు చల్లుతూ స్వాగతం పలికారు కుటుంబీకులు.వివరాల్లోకి వెళ్తే మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన కరుణాకర్, స్పందన దంపతులకు 27 రోజుల క్రితం ఆడపిల్ల పుట్టింది. ఇటీవల అమ్మమ్మగారి ఇంట్లో తొట్టెల కార్యక్రమం నిర్వహించారు. కాగా కరుణాకర్ నర్సాపూర్‌లోని తన నివాసానికి పుట్టిన పాపను తీసుకొస్తుండగా బంధుమిత్రులు, కుటుంబసభ్యులు అందరూ కలిసి పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. తమ ఇంటికి సాక్షాత్తూ మహాలక్ష్మి వచ్చిందని సంబరపడ్డారు. ఆడపిల్ల పుట్టగానే భారం అనుకొని విసిరేసిన తల్లిదండ్రులను చూసాం, కడుపులో పెరుగుతుంది ఆడపిల్లని తెలుసుకొని అబార్షన్లు చేయించే తల్లిదండ్రులను చూసాం. కానీ ఆడపిల్ల పుట్టడంతో సంబరాలు జరుపుకుంటూ ఘనంగా స్వాగతించడం మాత్రం చాలా అరుదు. నిజంగా ఈ కుటుంబాన్ని అభినందించాల్సిందే.

# కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి



**హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేసారు. ఫసల్ బీమా కింద కేంద్రం ఇన్సూరెన్స్ ద్వారా రైతులకు నష్టం భరించేందుకు సిద్ధంగా ఉంది, కానీ రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడం లేదన్నారు.సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాల యంలో మీడియా అమావేశం లో మాట్లాడుతూ ఎద్దేడిస్తే రైతులు ఎంతగా బాధపడతారో మనకు తెలుసు. రైతు ఏడిస్తే మన తెలంగాణ రాష్ట్రం కూడా బాధపడుతుంది.గతంలో కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల దుస్థితిపై పట్టించుకోలేదన్నారు.. ఈనాడు సుమారు 30 లక్షల టన్నులు వరిధాన్యం తడిసి పోయింది. ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.అ మహబూబ్నగర్ జిల్లాలో 51 ఏళ్ల గుగ్గులోత్ కిషన్, సూర్యపేట అన్నారం గ్రామంలో రైతు ఉప్పల వెంకన్న, జనగాం వెల్ది గ్రామంలో యాదగిరి వంటి రైతులు నష్టాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 442 మంది రైతులు చనిపోయారు.కేంద్ర ప్రభుత్వం ప్రతి పంటకు 2320 రూపాయల ఎంఆర్పీ అందిస్తోంది. పంట కొనుగోలు ఖర్చు అంతా కేంద్రమే భరిస్తోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారులకు పని కల్పించకుండా, పంట కొనుగోలు సరిగ్గా జరపకుండా రైతులను ఇబ్బందిపెడుతోంది.కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ ఇస్తూ, 10 రకాల పంటలకు బోనస్ ఇస్తామని ప్రకటించింది.కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు, రైతులను మోసం చేస్తున్నారు.ఫసల్ బీమా కింద కేంద్రం ఇన్సూరెన్స్ ద్వారా రైతులకు నష్టం భరించేందుకు సిద్ధంగా ఉంది, కానీ రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడం లేదని విమర్శించారు.. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సౌర విద్యుత్ వ్యవస్థలు, 24 గంటల కరెంట్, నీరు అందిస్తున్నారు, కానీ తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు కల్పించడం లేదు. మాన్సూన్ ముందస్తు హెచ్చరికలు వచ్చినా క్రాపింగ్ ప్లానింగ్ చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన ఆలోచన లేదు.రుణమాఫీ గురించి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక మాటలు చెప్పినా, ఎంత మందికి పూర్తిగా ఎంత రుణమాఫీ చేశారో చెప్పలేదు.కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడం వల్ల రైతులకు తీసుకున్న లోన్లపై వడ్డీ, చక్రవడ్డీ వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నారు, మళ్లీ లోన్ దొరకడం లేదు.రైతు బంధు, రైతు కూలీలకు వాగ్దానం చేసినట్లుగా నగదు ఇవ్వడం లేదు, ఎందుకు ఇవ్వలేదు?డబ్బులు లేవని చెబుతూ హామీలు, పథకాలు అమలు చేయకపోవడం సిగ్గుచేటు.కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ ముందు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఏవీ అమలు చేయకుండా రైతులను, మహిళలను, విద్యార్థులను, యువకులను మోసం చేసింది.ప్రతి క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తానన్న డిక్లరేషన్ కూడా అమలు చేయలేదన్నారు.. రైతులు పండించిన ప్రతి పంట కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం మొత్తం నిధులు ఇస్తోంది.సుతిలి, సంచి, కాంటాకు, హమాలికి, ట్రాన్స్‌పోర్టేషన్, బ్యాంకులో మూడు నెలల కాలం వడ్డీ సహా అవసరమైన అన్ని డబ్బులు కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది.అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ 30 లక్షల టన్నుల ధాన్యం కొనకపోవడం, రైతుల జీవితాలతో చెలగాటం చేస్తోంది.పీఎం కుసుమ్ పథకం క్రింద 4000 మెగావాట్ల సౌరశక్తి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 30-40%, రాష్ట్ర ప్రభుత్వం 30% సబ్సిడీ ఇవ్వాలి. కాని దాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం భరించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం దీనిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని రామచంద్ర రెడ్డి దుయ్యబట్టారు.

## అమాయకులే టార్గెట్గా ప్రైవేట్ ఫైనాన్స్‌ల వేధింపులు

### ప్రజా వాణిలో భాదితుల ఫిర్యాదు

**జగిత్యాల :** జగిత్యాల జిల్లా లో ప్రైవేట్ ఫైనాన్స్ ఆగడాలు రోజురోజుకు మితిమీరి, లోన్లు తీసుకొన్నవాళ్ళను విడిచి అమాయకులను వేదిస్తున్న సంఘటన జగిత్యాల లో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే జగిత్యాల రూరల్ మండలం తాటి పెల్లి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులకు బజాజ్ ఫైనాన్స్, క్రెడ్బి కంపెనీలు లోన్ కట్టాలని వేధింపులకు దిగినట్లు ఫిర్యాదు లో పేర్కొన్నారు. లోన్లతో తమకు ఎలాంటి సంబంధం లేదని, లేని వ్యక్తులకు ఫోన్ చేసి వేధిస్తున్నారని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ముక్కు ముఖం

## కరోనా పేరిట ప్రజలను భయాందోళనకు గురిచేయకండి

### ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్

**కోరుట్ల :** ప్రపంచ వ్యాప్తంగా కరోనా పేరిట జరిగిన విద్వాంసం మర్వక ముందే మళ్లీ మనల్ని భయాందోళనకు గురిచేసే గందరగోళం పునరావృతం అవుతుందని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ఆరోపించారు.

సోమవారం కోరుట్ల పట్టణంలోని ఆయన కార్యాలయంలో పేట భాస్కర్ మాట్లాడుతూ కేవలం భయాందోళన వల్లే చాలా మంది గతంలో మృతి చెందారని ఇకపై అలాంటి సమస్యలు రాకూడదని దానికి దేశ పౌరులుగా మనందరి బాధ్యతగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న పుకార్లు నిజమైన వాటిని పదేపదే పెట్టడం వల్ల తీవ్ర ప్రాణనష్టం జరుగుతుందని అది గతంలో మనందరం సవి చూశామని గుర్తు చేశారు. మున్సిపల్ కార్మికులు, వైద్యులు వారి సిబ్బంది, పోలీసులు, రెవెన్యూశాఖ మరియు పాత్రికేయులు ప్రజలను అప్రమత్తం చేయడంలో వారిని రక్షించడంలో కీలక పాత్ర పోషించారని భవిష్యత్తులో కూడా వారి సేవలు వుంటాయని అలాంటి అప్పుడు సోషల్ మీడియాలలో వ్యాపార దృక్పథంతో ప్రజలను భయాందోళనకు గురిచేసి లబ్ధి పొందాలని చూడడం కొందరు మానుకోవాలని పేట భాస్కర్ సూచించారు.

## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

**జగిత్యాల :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి పిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్. మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 59 పిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి ఎస్ లత, కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి వివిధ జిల్లా అధికారులు,తహసీల్దర్లు,కలెక్టరేట్ పర్యవేక్షకులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు... వేగవంతంగా స్పీడ్ ఆఫ్ చేయాలి..

**జగిత్యాల :** జిల్లాలో వారి ధాన్యం కేంద్రాలలో ఉన్నటువంటి ధాన్యము ఆరబోసి మ్యాచర్ వచ్చిన వెంటనే వేగవంతంగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు ఆదేశించారు . సోమవారం రోజున జిల్లాలోని జగిత్యాల రూరల్ మండలం,సోమన్ పల్లి గ్రామంలోని, ధర్మపురి మండలం లోని జైన గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగిత్యాల జిల్లాలోని వరి ధాన్యం కేంద్రాల్లో తడిసినటువంటి ధాన్యము ఆరబోసి మ్యాచర్ వచ్చిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు వెంటనే తరలించాలని కొనుగోలు చేసిన వెంటనే రైస్ మిల్లర్లకు పంపించాలని అధికారులకు ఆదేశించారు ప్రతిరోజు మిల్లులకు పంపాలి. రవాణా నిమిత్తం లారీల కొరత ఎక్కడా లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు.కొనుగోలు సెంటర్లలో ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హమాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు ఆందోళన చెందవద్దని ఆన్నారు.సెంటర్ ఇంచార్జ్ అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్,డిఎం జితేంద్ర ప్రసాద్ ,జగిత్యాల రూరల్ తహసిల్దార్ శ్రీనివాస్ ధర్మపురి ఇంచార్జీ తహసిల్దార్ సుమ॥, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

**సిద్దిపేట :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ఫిర్యాదుదారుల నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ తో కలిసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు అర్జిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, హౌసింగ్, ఆసరా పింఛన్ల మరియు ఇతర అర్జిలు మొత్తం 73 వచ్చాయి. అర్జిదారులకు న్యాయం చేసి తిరిగి అర్జి పెట్టుకోకుండా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అమాయకులే టార్గెట్గా ప్రైవేట్ ఫైనాన్స్‌ల వేధింపులు?

### ప్రజా వాణిలో భాదితుల ఫిర్యాదు

**జగిత్యాల :** జగిత్యాల జిల్లా లో ప్రైవేట్ ఫైనాన్స్ ఆగడాలు రోజురోజుకు మితిమీరి, లోన్లు తీసుకొన్నవాళ్ళను విడిచి అమాయకులను వేదిస్తున్న సంఘటన జగిత్యాల లో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే జగిత్యాల రూరల్ మండలం తాటి పెల్లి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులకు బజాజ్ ఫైనాన్స్, క్రెడ్బి కంపెనీలు లోన్ కట్టాలని వేధింపులకు దిగినట్లు ఫిర్యాదు లో పేర్కొన్నారు. లోన్లతో తమకు ఎలాంటి సంబంధం లేదని, లేని వ్యక్తులకు ఫోన్ చేసి వేధిస్తున్నారని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ముక్కు ముఖం తెలియనీ వారికి లక్షల రూపాయలు లోన్లు ఇచ్చి ఆ లోన్లను కట్టాలని ప్రతిరోజు మాకు ఫోన్ చేసి వేధిస్తున్నారని, మధ్యతరగతి కుటుంబానికి చెందిన మేము బ్రతకడానికి కష్టంగా ఉందని రోజు వారి పనులు చేసుకుని బ్రతికే నిరుపేదలమైన మమ్ములను కొందరు ఫైనాన్స్ ల పేరుతో మోసం చేస్తూ ఉన్నారని, తమకు లోన్ తీసుకున్న వ్యక్తితో ఎలాంటి సంబంధం లేదని, ఫైనాన్స్ కంపెనీ వాళ్ళు తమను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ప్రజావాణిలో బాధితులు ఫిర్యాదు చేశారు.

## సాధారణ ప్రసవాలను ప్రోత్సాహించాలి

**కరీంనగర్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన మహిళా సూపర్వైజర్లు అందరితో సమీక్షా సమావేశము నిర్వహించనైనది. ఇందులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారీగా సమీక్షిస్తూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మొదటి కాన్పుల కొరకు గర్భవతులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సాధారణ డెలివరీ కొరకు ప్రోత్సహించాలన్నారు. గైనకాలజీ డాక్టర్ చేత హెల్త్ చెకప్ చేయిస్తూ సిజేరియన్ డెలివరీల వల్ల ఉత్పన్నమయ్యే అనారోగ్య సమస్యలను గర్భిణీకి, ఆమె కుటుంబ సభ్యులకు తెలియచేయాలన్నారు.






## కన్నప్పలో ప్రభాస్..
## రెబల్ స్టార్ పాత్ర నిడివిపై మంచు విష్ణు కామెంట్స్

టాలీవుడ్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కించిన చిత్రం కన్నప్ప. ఈ మూవీ ఇప్పటికే రిలీజ్ కావాల్సి ఉండగా.. ప్రీ ప్రొడక్షన్ కారణంగా వాయిదా పడింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చేనెల 27న థియేటర్లలో సందడి చేయనుంది. రిలీజ్‌కు ఇంకా నెల రోజుల సమయం మాత్రమే ఉండడంతో ఈ సినిమా ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు మంచు విష్ణు. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన మంచు విష్ణు.. ప్రభాస్ రోల్ గురించి ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ 30 నిమిషాల పాటు అతిథి పాత్రలో కనిపిస్తారని మంచు విష్ణు తెలిపారు. కన్నప్ప 3 గంటల 10 నిమిషాల రన్‌టైమ్‌ను కలిగి ఉందని అన్నారు. కన్నప్ప పరివర్తనలో కీలక పాత్ర పోషించే దైవిక వ్యక్తిగా ప్రభాస్ నటించారని వెల్లడించారు. ఈ సినిమాను ఆధ్యాత్మిక మార్గంలో బయలుదేరే ఒక నాస్తికుడి గురించిన పౌరాణిక కథగా తెరకెక్కించినట్లు తెలిపారు. ప్రభాస్‌కు మోహన్ బాబుతో ముఖ్యమైన సన్నివేశాలు ఉన్నాయని వివరించారు. మోహన్ లాల్ పాత్ర 15 నిమిషాలకే పరిమితం అయినప్పటికీ.. బలమైన భావోద్వేగాన్ని కలిగి ఉంటుందని పేర్కొన్నారు. కాగా.. ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ అతిధి పాత్రలలో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి శ్రీ–కాళహస్తి అనే పాటను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సాంగ్ మే 28న విడుదల కానుంది. ఈ భక్తి గీతంలో విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా పాడారు. ఈ పాటకు స్టీఫెన్ దేవస్సీ సంగీతం అందించారు. ఆధ్యాత్మికంగా ఈ పాట ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు. ఈ సినిమాకు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించగా.. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై నిర్మించారు. ఈ సినిమాలో మోహన్ బాబు, శరత్‌కుమార్, అర్పిత్ రంకా, ప్రీతి ముఖుందన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## నవీన్ పొలిశెట్టి అనగనగా ఒక రాజు థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి కాంపౌండ్ నుంచి వస్తోన్న సినిమాల్లో ఒకటి అనగనగా ఒక రాజు ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ వెడ్డింగ్ వీడియో వైరల్ అవుతోంది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ సినిమా నవీన్ పొలిశెట్టికి ప్రమాదం కారణంగా ఆలస్యమైంది. తాజాగా మేకర్స్ చాలా రోజులకు రిలీజ్ అప్‌డేట్ అందిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా జనవరి 26న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో నవీన్ పొలిశెట్టి లుంగీ, బనియన్ వేసుకుని, మెడలో రుమాలు వేసుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తుండటం చూడొచ్చు. ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.

**ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా..?**

రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై అంచనాలు అమాంతం చేస్తోంది.




## మ్యాడ్ స్క్వేర్ తర్వాత గ్యాంబ్లర్స్.. టీజర్ చూశారా?




మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల ఫేమ్ సంగీత్ శోభన్ హీరోగా రూపొందిన చిత్రం 'గ్యాంబ్లర్స్'. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ విడుదలైంది. ఒక ఐలాండ్‌లో జరిగే జూదం చుట్టూ ఈ మూవీ కథ తిరుగుతుంది. కేఎస్‌కే చైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రశాంతి చారులింగ హీరోయిన్‌గా, రాకింగ్ రాకేశ్ ముఖ్యపాత్రలో నటించారు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మించారు. నిర్మాణానంతర పనులు తుది దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని జూన్ 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. టీజర్ చూస్తే కథలో అనేక థ్రిల్లింగ్ అంశాలతో పాటు ట్విస్ట్‌లు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉన్నాయి.

## అంచనాలు పెంచేసిన అడివి శేష్ డెకాయిట్




టాలీవుడ్ యంగ్ టాలెంటెడ్ హీరోస్‌లో అడివి శేష్ ఒకరు. ఇప్పటి వరకు ఆయన చేసిన చిత్రాలన్నీ కూడా వైవిధ్యంగా ఉంటాయి. అయితే ఈ హీరో నుండి సినిమా వచ్చి చాలా కాలమవుతుంది. ప్రస్తుతం మనోడు రెండు సినిమాలతో బిజీగా ఉన్నాడు. అందులో ఒకటి గూఢచారి సినిమాకు సీక్వెల్ గా జీ2 కాగా, మరొకటి డెకాయిట్. ఈ రెండు సినిమాలు ఇప్పుడు షూటింగ్ దశలోనే ఉన్నాయి. ఈ రెండు సినిమాల్లో ముందుగా జీ2 ముందు మొదలు కాగా, ఆ చిత్రమే ఫస్ట్ రిలీజవుతుందని అందరూ అనుకున్నారు. కాని జీ2 కన్నా ముందు డెకాయిట్ రిలీజ్ అవుతుంది. ఈ మూవీని డిసెంబర్ 25న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ ద్వారా తెలియజేశారు. మోస్ట్ అవెయిటెడ్ యాక్షన్ డ్రామాగా 'డెకాయిట్' రూపొందుతుండగా, దీనికి ఒక ప్రేమ కథ అనేది ట్యాగ్‌లైన్. షానిల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తుంది. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. తాజాగా మూవీ నుండి గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో అడివి శేష్ తన నటనతో మరోసారి ఆకట్టుకున్నాడు. గ్లింప్స్ అయితే మూవీపై భారీ అంచనాలు పెంచేసింది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం కోసం సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శేష్ నటించిన క్షణం , గూఢచారి సినిమాలకు సినిమాటోగ్రాఫర్ గా వర్క్ చేసిన షానియల్ డియో డైరెక్టర్ గా ఈ డెకాయిట్ చిత్రం తెరకెక్కుతుండడం విశేషం.. సుప్రియ యార్లగడ్డ , సునీల్ నారంగ్ సంయుక్తంగా ఈ చిత్నాన్ని నిర్మిస్తున్నారు. మూవీ మాత్రం పెద్ద హిట్ అవుతుందనే నమ్మకంతో మేకర్స్ ఉన్నారు. ఆ మధ్య శృతి హాసన్ ఇందులో నటిస్తుందని పోస్టర్ ద్వారా తెలిపారు. కాని తర్వాత ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకుందని తెలిసింది. డేట్స్ ఇష్యూతో పాటు అడివి శేష్ కూడా కారణం అని తెలుస్తోంది. అడవి శేష్, శృతి హాసన్‌ను కలిసి స్క్రీన్‌పై చూడొచ్చని అంచనాలు పెంచుకున్న ప్రేక్షకులకు నిరాశే మిగిలింది.

## సరికొత్త పోజులతో షేక్ చేస్తున్న రుహాణి శర్మ



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.